



రంపచోడవరంలో అటెన్షన్..

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద టెన్షన్ నెలకొంది. మంగళవారం ఉదయం ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన హిడ్మా సహా ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను అక్కడే భద్ర పరిచారు. బుధవారం కుటుంబీకులు, బంధువులు రావడంతో పోస్టుమార్టం ప్రక్రియ ప్రారంభించారు. హిడ్మా, ఆయన భార్య రాజే మృతదేహాలకు హిడ్మా సోదరుడు ముయా, రాజే సోదరుడు హెలిన్ సమక్షంలో పోస్టుమార్టం పూర్తిచేశారు. మంగళ, బుధవారం ఎన్‌కౌంటర్లలో మరణించిన మిగిలినవారికి గురువారం పోస్టుమార్టం చేస్తారు.





అడవిలో.. అలజడి

గిరిజనుల్లో భయం భయం

అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ల జరిగిన సమీప గ్రామాల్లో 'ఆంధ్రజ్యోతి' బృందం బుధవారం పర్యటించింది. అయితే ఇక్కడ సాధారణ వాతావరణమే నెలకొంది. చాలామందికి ఎన్‌కౌంటర్ తమకు సమీపంలోనే జరిగిందనే సమాచారం కూడా తెలీదు. మారేడుమిల్లి మండల కేంద్రంలోనే అలాంటి వాతావరణం కనిపించలేదు. కానీ మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగిన నెల్లూర్ సమీప నివాసిత ప్రాంతంలోనూ, బుధవారం ఎన్‌కౌంటర్ జరిగిన గుజ్జుమామిడి వలస (జీఎం వలస) పంచాయతీలోనూ ఇదే విషయం చర్చించుకుంటున్నారు. కొండపోడు వ్యవసాయం, కల్లు చెట్టు గీతకు ప్రతిరోజూ వేకువజామునే ఆయా అటవీ మార్గాల్లో సంచరించే గిరిజనులు ఈ ఘటనతో తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు.

మారేడుమిల్లికే ఎందుకు?

- రెండో రోజూ పేలిన తూటాలు
- టెక్ శంకర్ సహా ఏడుగురు మృతి
- ఆపరేషన్ సంభవ్ సక్సెస్
- కొనసాగుతున్న కూంబింగ్
- రంపచోడవరం ఆసుపత్రికి సీన్
- భారీగా భద్రతా బలగాల పహారా

(రంపచోడవరం/మారేడుమిల్లి)

అడవిలో అలజడి రేగింది. గత రెండు రోజులుగా ప్రశాంతంగా ఉండే మారేడుమిల్లి ఫారెస్ట్‌లో తూటాల శబ్దాలు.. కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాల బూట్ల హడావుడితో తెలియని భయం నెలకొంది. ఇక్కడ వరుసగా జరిగిన రెండు ఎన్‌కౌంటర్లతో రేపు ఏం జరుగుతుందోననే ఆందోళన కలిగిస్తున్నాయి. మావోయిస్టు అగ్రనేత హిడ్మా, ఆయన భార్య రాజే సహా మొత్తం ఆరుగురు మంగళవారం నాటి ఎన్‌కౌంటర్లో హతమైన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ ఘటన జరిగి 24 గంటలు దాటక ముందే బుధవారం వేకువజామున జరిగిన మరో ఎన్‌కౌంటర్ హడలెత్తించింది. మొదటి ఎన్‌కౌంటర్ మారేడుమిల్లి మండలంలోని నెల్లూరులో జరగ్గా.. ఆరుగురు మృతి చెందారు.. ఇదే మండలంలోని జీఎం వలస గ్రామంలో రెండో ఎన్‌కౌంటర్ జరగ్గా ఏడుగురు మృతి చెందారు. గత రెండు రోజులుగా వందలాది భద్రతా దళాల రాకపోకలతో రంపచోడవరం-మారేడుమిల్లి ఏజెన్సీ హడావుడిగా మారింది. మృతదేహాలు భద్రపరిచిన రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద భద్రతా దళాలు పహారాగా ఉన్నారు. ప్రతి ఒక్కరి రాకపోకలను నిరంతరం వీరు పర్యవేక్షిస్తున్నారు.ఏరియా ఆసుపత్రికి వచ్చిన మృతుల బంధువులు విడిగా కూర్చొని ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి విషయంలోనూ గోప్యత పాటిస్తున్నట్టుగా ఇక్కడి పరిస్థితి నెలకొంది.

రంపచోడవరం ఏజెన్సీలో దాదాపు రెండు దశాబ్దాల నుంచి నక్సల్స్ జాడలు తగ్గిపోయాయి. ఈ ఏడాది ఏడు నెలల్లో నాలుగు ఎన్‌కౌంటర్లు జరగడంతో పాటు బుధవారం నాటికి 18 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఏడాది వై.రామవరం మండలం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు, జూన్‌లో మారేడుమిల్లి మండలం కింటుకూరు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు,బుధవారం నాటి ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ నుంచి సురక్షిత ప్రాంతమైన మారేడుమిల్లి ఏజెన్సీకి మావోయిస్టులు తరలివస్తున్నారని స్వయంగా జిల్లా ఎస్పీ బర్దర్ వెల్లడించడంతో మళ్లీ మావోయిస్టుల ప్రభావంపై చర్చ జరుగుతోంది. మారేడుమిల్లి ఏజెన్సీలోకి మావోయిస్టులు.. ముఖ్యనేతలు వస్తున్నారంటే ఇప్పటికే ఇక్కడ అనువైన వాతావరణం ఏర్పాటుచేసుకుని ఉండొచ్చనే వాదన వినిపిస్తోంది.దీంతో నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి. కూంబింగ్ నిరంతరం సాగేలా భద్రతా దళాలకు ఆదేశాలు అందుతున్నాయి.

సెంట్రల్ జైలుకు 40 మంది

రాజమహేంద్రవరం/కాకినాడ/రావులపాలెం,నవంబరు19 (ఆంధ్రజ్యోతి): పోలీసులు మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని విజయవాడ,ఏలూరు, సామర్లకోట, రావులపాలెంలలో అదుపులోకి తీసుకున్న మావోయిస్టులను రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాలకు కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. ఏలూరులో పట్టుబడిన 10 మంది, విజయవాడలో నలుగురు, రావులపాలెంలో అరెస్టు చేసిన ఒకరిని కలిపి 15మందిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించాలని ఆయా కోర్టులు బుధవారం ఆదేశించాయి. విజయవాడ, ఏలూరు, కాకినాడలో అరెస్టు చేసిన 29 మంది మహిళలను ప్రత్యేక మహిళా కారాగారానికి తరలించాలని ఆదేశించాయి. ఇప్పుడు రిమాండుకు ఇచ్చిన 40 మందిపై ఉపా చట్ట ప్రకారం కూడా కేసులు నమోదు చేశారు. దీంతో వీళ్లను మిగతా ఖైదీలతో కలవకుండా ఉంచాల్సి ఉంటుంది. ఇప్పటికే జైలు 1300 మందితో కిక్కిరిసి ఉండడం, గదుల కొరత ఉండడంతో వీళ్లను ఎక్కడ ఉంచుతారో అనే సందిగ్ధం నెలకొంది.



సామర్లకోట నుంచి ఇద్దరు

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కొప్పవరంలో పట్టుబడిన ఇద్దరు మహిళా మావోయిస్టులను పోలీసులు బుధవారం సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ నేతృత్వంలో మహిళా ఎస్ఐ, మరికొంత మంది ఎస్కార్ట్ సిబ్బంది మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో కేసు పత్రాల సమర్పించిన అనంతరం జడ్జి షేక్ షరీన్ 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. పట్టుబడిన ఇద్దరు మహిళా మావోయిస్టుల పేర్లు అనూష, అంకితగా చెబుతున్నారు. మహిళా మావోయిస్టుల్లో ఒకరు మాత్రమే న్యాయమూర్తి మాటలకు సమాధానమిచ్చారు.

రావులపాలెంలో హిడ్మా అనుచరుడు



రావులపాలెం,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెంలో మావోయిస్టు హిడ్మా అనుచరుడు సరోజ్ మడివి అలియాస్ ఓండాను పోలీసులు అరెస్టు చేసినట్టు రావులపాలెం సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా కృష్ణరాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుర్గేలంకకు చెందిన సరోజ్ మడివి 12వ ఏట మావోయిస్టుల కార్యకలాపాలకు ఆకర్షితుడయ్యాడు. నిఘా వర్గాల సమాచారంతో మంగళవారం రాత్రి రావులపాలెం గౌతమి వంతెన సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. తుపాకీతోపాటు పది తూటాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

2 ఎన్‌కౌంటర్లు..13 మంది హతం : ఎస్పీ

ఆపరేషన్ సంభవ్ పేరిట ఈ కూంబింగ్ జరిగింది. మొదటి రోజు తప్పించుకున్న మావోయిస్టుల కోసం గాలిస్తుండగా బుధవారం తెల్లవారుజామున భద్రతా దళాలకు ఎదురుపడడం, వెంటనే జరిగిన ఎదురుకాల్పుల్లో టెక్ శంకర్ సహా ఏడుగురు మావోయిస్టులు హతమయ్యారు. ఈ రెండు ఎన్‌కౌంటర్లకు సంబంధించి మొత్తం 13 మంది మావోలు మరణించారు.



తెల్లవారుజామున శబ్దాలు : నారాయణరెడ్డి, జీఎం వలస

తెల్లవారు జామున నాలుగు గంటలకు అటవీ ప్రాంతం నుంచి భారీ శబ్దాలు వినిపించాయి. తొలుత పర్యాటకులెవరో సందడి చేస్తున్నారని భావించాం. వరుస భారీ పేలుళ్ల శబ్దాలతో భయపడ్డాం. కొద్దిసేపటికి పోలీసులు వచ్చి ఎవరు అటవీ ప్రాంతం వైపుగానీ, చేను పాకల వైపు రావొద్దని హెచ్చరించడంతో భయాందోళనకు గురయ్యాం.





మోతుగూడెం పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సీఆర్పీఎఫ్ బెటాలియన్ సిబ్బంది

మోతుగూడెంలో వాహనాలు తనిఖీలు

మోతుగూడెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తూర్పు ఏజెన్సీ ప్రాంతమైన మారేడుమిల్లిలో మావోయిస్టుల కదలికలు.. మంగళ, బుధవారాల్లో ఎన్‌కౌంటర్‌లో మొత్తం 13మంది మరణించడం, వేర్వేరు ప్రాంతాల్లో పదుల సంఖ్యలో పోలీసులకు చిక్కడం వంటి ఘటనల నేపథ్యంలో పోలీసులు ఎక్కడికక్కడ అప్రమత్తమయ్యారు. ఏవోబీ సరిహద్దుల్లో చింతూరు మండలం మోతుగూడెం మండలం పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద ట్రైనింగ్ ఆర్ఎస్ఐ ప్రవీణ్ శివప్రసాద్, పోలీస్ సిబ్బంది పోలీసులు తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. వచ్చిన ప్రతివాహనాన్ని సీఆర్పీఎఫ్ బెటాలియన్ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ మనీషా

కాకినాడలో బాలల హక్కుల వారోత్సవ ర్యాలీ

కార్పొరేషన్(కాకినాడ),నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ నుంచి బాలాజీ చెరువు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. వెయ్యిమంది విద్యార్థులతో బాలలపై లైంగిక వేధింపుల వ్యతిరేక ర్యాలీని అసిస్టెంట్ కలెక్టర్ మనీషా బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. పిల్లలహక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యతల వహించాలని ఆమె పిలుపునిచ్చారు. పోక్సో, బాల్య వివాహ నిరోధక చట్టాల అమలును క్షేత్రస్థాయిలో మరింత బలపరచాలని సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహానాయక్ మాట్లాడుతూ బాలలపై జరుగుతున్న వేధింపులు మానవతా విలువలకు విరుద్ధమని, మాదకద్రవ్యాల ప్రభావం పెరుగుతుండడం ఆందోళనకరమని అన్నారు. ఐసీడీఎస్ పీడీ సీహెచ్ లక్ష్మి మాట్లాడుతూ శిశుగృహం ద్వారా 0-5 ఏళ్ల పిల్లలకు సంరక్షణ అందుబాటులో ఉందన్నారు. చట్టవిరుద్ధ దత్తతలకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వివిధ శాఖల అధికారులు, పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది, చెల్డ్‌లైన్ 1098 బృందం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం దిశగా

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ
- సామర్లకోటలో రెండో విడత 'అన్నదాత సుఖీభవ-పంట పెట్టుబడి సాయం' పంపిణీ కార్యక్రమం

కూటమి ప్రభుత్వం పయనం

సామర్లకోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమం, వ్యవసాయం, పరిశ్రమలు అభివృద్ధి చేసే దిశగా పయనిస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరి నారాయణ అన్నారు. రైతులకు రెండో విడత అన్నదాత సుఖీభవ-పంట పెట్టుబడి సాయం పంపిణీ కార్యక్రమం సామర్లకోటలో మంత్రి నారాయణ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి బుధవారం ప్రారంభించారు. సామర్లకోటలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే చినరాజప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రినారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కార్యక్రమం రాష్ట్రంలో ఒక పండుగ వాతావరణంలో జరుపుతున్నారన్నారు. పీఎం కిసాన్ కింద మూడు విడతలుగా కేంద్రం రూ.2వేల చొప్పున ఇస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమచేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు పరిపాలనా దక్షతతో ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిలో 90శాతం అమలు చేశామని, రానున్న కాలంలో మిగిలిన 10శాతం కూడా అమలు చేస్తామని అన్నారు. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు రూ.13లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారన్నారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నదాతా సుఖీభవ పెట్టుబడి సాయం కింద అండగా నిలవడం అభినందనీయమన్నారు. ఈపథకం కింద పెద్దాపురం నియోజకవర్గంలో 14,921మంది రైతులకు రూ.10.02కోట్ల మేర లబ్ధిచేకూరిందన్నారు.కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ అన్నదాతా సుఖీభవ కార్యక్రమం కింద రైతులకు పంటపెట్టుబడి సాయంగా రూ.99.88కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాయన్నారు. డబ్బులు జమకాని రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు. నమూనా చెక్‌లను ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు అందజేశారు.వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన ధాన్యం తేమశాతం పరిశీలన, ప్రకృతి వ్యవసాయ ప్రదర్శనలను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ పాల్గొన్నారు.



సామర్లకోటలో చెక్‌ను రైతులకు అందజేస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే చినరాజప్ప, ఎంపీ సతీష్, కలెక్టర్ షాన్‌మోహన్

'అన్నదాత సుఖీభవ' ద్వారా రైతుల ఖాతాల్లో రూ.99.88కోట్లు

- జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

జిల్లాలో వ్యవసాయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు, రైతులను వ్యవసాయం పట్ల ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని జిల్లా వ్యవసాయాధికారి విజయ్ కుమార్ వెల్లడించారు. జిల్లాలో తొలిసారిగా సామర్లకోటలో అన్నదాత సుఖీభవ రెండో విడత ఆర్థికసాయం పంపిణీకార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలో రెండోవిడత అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా 21 మండలాల్లో ఉన్న 1,50,475మంది రైతులకు పంటపెట్టుబడి సాయంగా రూ.99.88కోట్ల నగదును రైతుల ఖాతాలకు నేరుగా జమవుతుందన్నారు. వీటిలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.75.24కోట్లు, పీఎం కిసాన్‌గా కేంద్ర ప్రభుత్వంనుంచి రూ.24.64 కోట్ల ఉన్నట్లు తెలిపారు. ఆయా మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో అర్హులైన రైతుల జాబితాలు ప్రదర్శించినందున పీఏపీల సహకారంతో తమ ఖాతాల్లో ఎంతమొత్తం జమ అయ్యిందో తెలుసుకోవచ్చన్నారు.

ఐఎంఏ అధ్యక్షుడిగా కాదా వెంకటరమణ

- రెండేళ్ల పదవీకాలంతో నూతన కార్యవర్గం ఏర్పాటు



కాద వెంకటరమణ (అధ్యక్షుడు)



డాక్టర్ రామకృష్ణ, గౌరవ కార్యదర్శి

కాకినాడ/సర్పవరం జంక్షన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) కాకినాడ శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ కాదా వెంకటరమణ ఎన్నికయ్యారు. బుధవారం కాకినాడలోని రాంకోశా భవనంలో జరిగిన ఐఎంఏ సర్వసభ్య సమావేశంలో 2025-27 కాలానికి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారి డాక్టర్ జీఎస్ మూర్తి తెలిపారు. అధ్యక్షుడిగా డాక్టర్ కాదా వెంకటరమణ (2025-2026), ప్రెసిడెంట్ (ఎలెక్ట్)గా డాక్టర్ బి.విష్ణుమహేష్‌బాబు (2026-2027), గౌరవ కార్యదర్శిగా డాక్టర్ ఎస్‌సీహెచ్ఎస్ రామకృష్ణ(రెండేళ్లు), కోశాధికారిగా డాక్టర్ పైడికొండల ఎల్ఆర్ఎన్ నర్సింగరావు,ఉపాధ్యక్షులుగా డాక్టర్ జి.కృష్ణవేణి, డాక్టర్ ఎస్.వీరభద్రరావు, డాక్టర్ త్రిమూర్తులు రాయుడు, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ వి.వరప్రసాద్, డాక్టర్ అమంచర్ల హర్షవర్ధన్, డాక్టర్ రాజనీదీప మమిల్లా, ఐఎంఏ ఏఎంఎస్ చైర్మన్‌గా డాక్టర్ ఆర్.గౌతమ్‌ప్రవీణ్, సెక్రటరీగా డాక్టర్ పీవీ నిశాంత్, ఐఎంఏ సీజీపీగా చైర్మన్ డాక్టర్ కెశైలజ, సెక్రటరీగా డాక్టర్ పి.జానకి, ఐఎంఏ మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా డాక్టర్ జి.సత్యవతి, సెక్రటరీగా డాక్టర్ ఎ.మాధవి, ఏడీఎన్ చైర్మన్‌గా డాక్టర్ థొండూరు పీఎస్ఎస్ఆర్ అభిలాష్, ఎంఎస్ఎన్ చైర్మన్ డాక్టర్ ముద్దా రాజేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ గంటి భానుమతి, డాక్టర్ వాణీమాధవి, డాక్టర్ సుభాష్, డాక్టర్ ఎల్.చందు, డాక్టర్ కె.ప్రశోభ్‌కుమార్, డాక్టర్ నిఖితారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరరావు నియమితులయ్యారు.

జిల్లాలో నర్సుల సమస్యలపై సమీక్ష

జీజీహెచ్(కాకినాడ),నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, ఏరియాఆస్పత్రులు, బోధనాస్పత్రి కాకినాడ జీజీహెచ్‌ల్లోని నర్సుల పలు సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శెట్టిపల్లి రాధమ్మ, రాష్ట్ర కార్యదర్శి కోటమ్మతో కలిసి బుధవారం కాకినాడ జీజీహెచ్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రేడియాలజీ సెమినార్ హాల్లో జరిగిన ఈ సమావేశంలో రాధమ్మ మాట్లాడుతూ పీహెచ్ సీల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులకు భద్రత ఉండడం లేదన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు, నర్సులు, సిబ్బంది కలిసి 14మంది ఉండాల్సి ఉండగా ఆరు లేదా ఏడుగురు మాత్రమే ఉంటున్నారని తద్వారా పని భారం, ఒత్తిడి పెరిగిపోతుందన్నారు. నర్సులపై తరచూ దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. జిల్లా ప్రభుత్వ నర్సుల సంఘం అధ్యక్షురాలు బూరిగ విజయలక్ష్మి, కార్యదర్శి గట్టు ప్రమోద, 500మంది నర్సులు పాల్గొన్నారు.

కమిటీలు సరే.. సేవలు ఏవి?

- కొలువుదీరిన ఏఎంసీ పాలకవర్గాలు
- గత వైసీపీ పాలనలో అలంకారప్రాయం
- మార్కెట్ కమిటీల లక్ష్యం నిర్వీర్యం
- ఇప్పటికైనా నూతన కమిటీలు చొరవ తీసుకోవాలంటున్నరైతులు

పెద్దాపురం,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులకోసం.. అన్నదాతల సేవలో భూమి పుత్రులను బాగుచేయాలని, దళారుల దోపిడీనుంచి గట్టెక్కించాలని, ఇలా ఎన్నో కార్యక్రమాల బాధ్యత వ్యవసాయ మార్కెట్ కమిటీలది. గత ఐదేళ్లు పేరుకే పాలకవర్గాలు నియామకాలు జరిగాయి. కానీ యార్డుల లక్ష్యాలను పూర్తిగా విస్మరించారు. అలంకార ప్రాయంగా మారిన పాలకవర్గాలు రైతుల గురించి వారి సమస్యల గురించి కనీస ఆలోచనలు చేయలేదు. ఈపరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను చక్కదిద్దే క్రమంలో మార్కెట్ కమిటీలకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తోంది. జిల్లా పరిధిలో ఇప్పటికే మార్కెట్ కమిటీల నియామకాలు జరిగాయి. ఈక్రమంలో ఇప్పటినుంచి అయినా పాలకవర్గాలు రైతుల సేవలో నిమగ్నమవ్వాల్సిన బాధ్యత ఉంది. రైతులనుంచి ఆదాయం పిండుకోవడమే కాకుండా వారి బాగోగులను ఆలోచించాల్సిన అవసరం ఉంది. కొత్త కమిటీలు కొలువుదీరడంతో నిలిచిపోయిన మార్కెట్ కమిటీ సేవలు మళ్లీ అమలవుతాయిని రైతులు ఆశిస్తున్నారు. మార్కెట్ యార్డుల పాలకవర్గాలు నియామకం ఇప్పటికే చాలావరకూ ఒక కొలిక్కి వచ్చింది. ఆయా పాలకవర్గాలు ప్రమాణస్వీకరణ బాధ్యతలు జరిగాయి. యార్డుల ద్వారా అన్నదాతలకు ఎన్నో రకాల సేవలు గతంలో అందేవి. ఆ సేవలన్నీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిలిచిపోయాయి. ఏటా ఆదాయం రూ.కోట్లలో చేరుతున్నా ఆ నిధులను వారి కోసం ఖర్చు చేయలేదు. గతంలో రైతుబంధు, లింకు రోడ్లు నిర్మాణం, పశువైద్య శిబిరాల నిర్వహణ, గోదాముల నిర్మాణం ఇలా ఎన్నో కార్యక్రమాలు మార్కెటింగ్ కమిటీల ఆధ్వర్యంలో జరిగేవి. గత వైసీపీ హయాంలో ఇలాంటి కార్యక్రమాలు ఊసేలేకుండా పోయింది. అన్నదాతలకు అందించాల్సిన పథకాలను అమలు చేయలేదు. గడచిన ఐదేళ్లలో కొత్తవీ అమలవ్వలేదు. ఉన్నవాటినే అటకెక్కించి రైతుల ప్రయోజనాలకు గండి కొట్టారు. దీంతో రైతులు తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. ఈ మార్కెటింగ్ విధానాన్ని తీసుకువచ్చి ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జరపాలని నిర్ణయం తీసుకుంది. కానీ, ఇదీ పక్కాగా అమలు కాలేదు. ప్రతి ఏఎంసీని కొనుగోలు కేంద్రంగా మార్చాలని ప్రతిపాదించారు. కానీ ఎక్కడా ఉత్పత్తులను కొనుగోలు చేయలేదు. ఈ పరిస్థితుల్లో నూతన పాలకవర్గాలు ఆయా సేవలను తిరిగి అందించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అటకెక్కిన రైతుబంధు పథకం..

వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మద్దతు ధర లేని పక్షంలో వాటిని యార్డులు కుదవపెట్టుకుని రుణాలు ఇచ్చేందుకు గతంలో రైతుబంధు పథకం అమలుచేశారు. గత ప్రభుత్వం దీన్ని పూర్తిగా విస్మరించింది. ఇందులో పంట దిగుబడులను నిల్వ చేసుకుని విలువలో 80శాతం వరకూ రుణంగా ఇచ్చేవారు. ధర వచ్చాక ఆయా ఉత్తత్తులను విక్రయించి రుణాలను తిరిగి తీర్చుకునే వెసులుబాటును కమిటీలు కల్పించేవి.

రోడ్ల నిర్మాణాల విస్మరణ

వ్యవసాయ ఉత్పత్తులను కల్లాలకు, ఇళ్లకు తరలించుకునేందుకు వీలుగా పొలాలకు అంతర్గత రహదారులను మార్కెటింగ్ కమిటీలు నిర్మించాలి. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఒక్కో కమిటీ పరిధిలో 30శాతం నిధులు ఇందుకు కేటాయించేవి. గత ఐదేళ్లలో ఒక్క రహదారి వేయలేదు. అసలు వారి కోసం ప్రతిపాదనలు చేసిన దాఖలాలు కనిపించలేదు. రైతులకు ప్రత్యామ్నాయ ఆర్థిక వనరుగా ఉండే పాడిపరిశ్రమ అభివృద్ధికి కూడా మార్కెట్ కమిటీలు పెద్దపీట వేసేవి. ఏడాదికి నాలుగు పశువైద్య శిబిరాలను ఏర్పాటుచేసేవి. వాటినీ నిర్వహించలేదు.

నిలిచిన గోదాముల నిర్మాణం

వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గోదాములు, శీతల గిడ్డంగులు నిర్మించాలి. ఐదేళ్లలో వాటిని సైతం విస్మరించారు. దీనివల్ల ఆదాయం కోల్పోవడమే కాకుండా రైతులు వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పైగా ప్రైవేటు గోదాములను ఆశ్రయించి అద్దెల రూపంలో చెల్లించి రైతులు ఆర్థికంగా ఎంతో నష్టపోయారు. మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులు కూరగాయల ధరలను ప్రతిరోజూ కమిటీలు ప్రకటించాలి. కనీసం ధరల పట్టికను కూడా యార్డులు నిర్వహించడం లేదని రైతులు వాపోతున్నారు. దీనివల్ల తాము దోపిడీకి గురవుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తవుడు కింద గంజాయి బస్తాలు

- చింతూరులో 120కిలోలు స్వాధీనం

7



విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్న సురేఖ (ఎరుపు జెర్సీ)

ఆదివాసీ బిడ్డ కుస్తీ మే సవాల్ అంటోంది. బరిలో ఎవరున్నా పతకం నాదే అంటోంది. గిరిజన గూడెంలో పుట్టి న ఈమె కుస్తీ పోటీల్లో ఎదుటివారిని మట్టికరిపిస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సత్తాచాటి జాతీయ స్థాయిలోనూ పతకం సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తోంది.



స్వర్ణ పతకంతో సురేఖ

కుస్తీ మే సవాల్

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

అల్లూరి జిల్లా చింతూరు మండలం అల్లిగూడేనికి చెందిన మడకం సురేఖ వరరామచంద్రపురం మండలం సోములగూడెం ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈమెకు ఫిజికల్ డైరెక్టర్ పూరి శివ కొద్ది నెలలుగా కుస్తీ పోటీలకు శిక్షణ ఇస్తున్నారు. అక్టోబరు 4న కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 పోటీల్లో పాల్గొన్న సురేఖ మొత్తం 60 మందిలో సత్తా చాటి బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ నెల 4, 5, 6 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లోనూ ఆమె ప్రతిభ కనబరిచింది. 52 మంది పాల్గొనగా విజేతగా నిలిచి మరో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. వచ్చే ఏడాది జనవరి మొదటివారంలో న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైంది. బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా సోములగూడెం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పండా సునీత, డిప్యూటీ వార్డెన్ మడకం భద్రమ్మ, ఉపాధ్యాయులు సురేఖను ఘనంగా సన్మానించారు.

సురేఖ తల్లిదండ్రులు ఆనంద్, ఊర్వశి. వీరిది అతి పేద కుటుంబం. చిన్నపాటి వ్యవసాయమే జీవనాధారం. పొద్దంతా పొలం పనులు చేసుకోవడం, అటవీ ఉత్పత్తులు సేకరించి అమ్మగా వచ్చిన సొమ్ములతో కుటుంబాన్ని వెళ్లదీస్తున్నారు.

- సత్తా చాటుతున్న సురేఖ
- రాష్ట్ర స్థాయిలో స్వర్ణ పతకం కైవసం
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక
- అల్లిగూడెం నుంచి న్యూఢిల్లీకి ఆదివాసీ బిడ్డ క్రీడా ప్రస్థానం



బిర్సా ముండా జయంతి సందర్భంగా సురేఖను సన్మానించిన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు



జాతీయ స్థాయి పోటీకి సాధన చేస్తున్న సురేఖ (నీలం రంగు షర్టు)



నేను సాధించలేనిది నా కూతురు సాధించింది

సురేఖ తండ్రి ఆనంద్



నాకు క్రీడలంటే ప్రాణం. చింతూరులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో 9వ తరగతి చదివినప్పుడు జిల్లా స్థాయిలో 800 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని విజయం సాధించాను. ఆపై అనారోగ్యంతో చదువుతో పాటు క్రీడా రంగానికి కూడా దూరమయ్యాను. ఇపుడు నా కూతురు రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతుండడం.. ఆమెకు పీడీ, ఉపాధ్యాయులు సహకరించడం ఎంతో సంతోషంగా ఉంది. నేను సాధించలేనిది నా కూతురు సాధిస్తుంటే పట్టలేనంత ఆనందంగా ఉంది.

ఉపాధ్యాయుల తోడ్పాటుతోనే సాధ్యమైంది: సురేఖ

పాఠశాల ఉపాధ్యాయులు నా ప్రతిభను గుర్తించి కుస్తీలో శిక్షణ ఇస్తున్నారు. వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించాను. ఉపాధ్యాయులే స్వయంగా సన్మానించడం నాకెంతో గర్వంగా ఉంది. నాలో పట్టుదలను మరింత పెంచింది.

జాతీయ స్థాయిలో పతకమే లక్ష్యం

పూరి శివ, సోములగూడెం ఆశ్రమ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్



సురేఖపై నాకు నమ్మకం ఉంది. ఆమె ప్రదర్శనే ఇందుకు నిదర్శనం. జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధనకు శక్తి వంచన లేకుండా కష్టపడుతున్నాం. తద్వారా రాష్ట్రంలో గుర్తింపు పొందడంతో పాటు ఆదివాసీ బిడ్డ మరింత ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది.

బిడ్డకి మిఠాయిలు ఇచ్చి వచ్చాము

సురేఖ తల్లి ఊర్వశి



సోములగూడెం వెళ్లి మా బిడ్డను చూసి వచ్చాము. మిఠాయిలు కొనిచ్చి వచ్చాము. ధైర్యం చెప్పాము. పీడీ, ఉపాధ్యాయులు సురేఖను సొంత బిడ్డలా చూసుకుంటున్నారు. జాతీయ స్థాయిలో గెలవాలని మొక్కుకుంటున్నా.



పోటీలను ప్రారంభిస్తున్న కోనసీమ జిల్లా డీఈవో సలీంబాషా

ఇందుపల్లిలో ఉమ్మడి జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం లంక రాణి ఆధ్వర్యంలో జరిగిన పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా ప్రార ంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు ప్రభుత్వం ప్రత్యేక క్రీడా కోటాను అమలుచేస్తుందన్నారు. జాతీయస్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తూ ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవాలని సూచించారు. బాలుర, బాలికల విభాగంలో వేర్వేరుగా నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కంకిపాటి వెంకటేశ్వరరావు, మట్టపర్తి వెంకటసముద్రం, జి.గణేష్‌బాబు, యనమదల శ్రీనివాసరావు, షేక్ వలీసాహెబ్ వ్యవహరించారు. సాయంత్రం వరకు జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించిన పవర్ లిఫ్టర్లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు తెలిపారు.

విజేతలు వీరే..

ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఇలా ఉన్నాయి. 53 కిలోల విభాగంలో సీహెచ్ సత్యగోపాల్ (ఇందుపల్లి), 59 కిలోల విభాగంలో డి.అనిల్ (భీమనపల్లి), 66 కిలోల విభాగంలో ఎంఎస్వీ అవినాష్ (సాకుర్రు), 74 కిలోల విభాగంలో జి.దినేష్‌ప్రసాద్ (ముక్కామల), 83 కిలోల విభాగంలో ఎం.దుర్గారామగణేష్ (అమలాపురం), 93 కిలోల విభాగంలో వై.యశ్వంత్‌సుజిత్‌కుమార్ (ముక్కామల), 105 కిలోల విభాగంలో ఎస్కేఎస్ఎస్ మణికంఠ (శానపల్లిలంక) విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో 43 కిలోల విభాగంలో కె.లక్ష్మీకీర్తన భీమనపల్లి, 47 కిలోల విభాగంలో టి.కీర్తి (రాజోలు), 52 కిలోల విభాగంలో కె.శిరీష (ఇందుపల్లి), 57 కిలోల విభాగంలో యు.షానిక (రాజోలు), 63 కిలోల విభాగంలో పి.స్పందన (రాజోలు), 69 కిలోల విభాగంలో ఎం.సంకీర్తనాదేవి (పాలమూరు), 76 కిలోల విభాగంలో వై.ఇందిర (గొల్లవిల్లి), 84కిలోల విభాగంలో వి.మేఘనశ్రీ (భీమనపల్లి) విజేతలుగా నిలిచారు. వీరికి డీఈవోతో పాటు జిల్లా అధికారి డాక్టర్ ఎంఏకే భీమారావు, గుబ్బల పెద్దిరాజు, కామన మధు పతకాలు అందజేశారు.

వర్క్‌షాప్‌లతో ఆవిష్కరణలపై ఆసక్తి

జేఎన్టీయూకే, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్క్‌షాప్‌లలో పాల్గొనడం ద్వారా అధ్యాపకులు, విద్యార్థుల్లో పరిశోధనా నైపుణ్యం, ఆవిష్కరణలపై ఆసక్తి పెరుగుతుందని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. జేఎన్టీయూలోని ఈసీఈ గ్యాలరీలో బుధవారం ట్రాన్స్‌ఫార్మింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ రీసెర్చ్ విత్ ఐఈఈఈ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. వీసీ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ప్రొఫెసర్ శ్రీనివాసకుమార్, అధ్యాపకులు ఉన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద్

కొక్కొరోకో సినిమా సందడి

● తూర్పుపాలెంలో పలు సన్నివేశాలు చిత్రీకరణ

మలికిపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండల పరిధిలోని తూర్పుపాలెంలో కొక్కొరోకో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. బుధవారం సంక్రాంతి పండుగకు సం బంధించిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా తూర్పుపాలెంలోని మండువా లోగిళ్లను రంగవల్లులు, పూలదండులు, అరటిచెట్లతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. పౌరాణిక వేషధారణలతో నటీనటులు వీధుల్లో సందడి చేశారు. గ్రామీణ ప్రాంత వాతావరణ నేపథ్యంలో సినిమాను చిత్రీకరిస్తున్నట్టు సినిమా నిర్వాహకుడు రమేష్ వర్మ తెలిపారు. ఆర్వీ ఫిల్మ్ హౌస్ నీలాద్రి ప్రొడక్షన్స్ సమర్పణలో చిత్రీకరణ జరుగుతోందన్నారు. శ్రీనివాస్ వసంతాల దర్శకుడిగా రేఖావర్మ, శిరీష కొర్రపాటి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. నటీనటులుగా సముద్రఖని, సునీల్, మురళీకృష్ణ, సప్తగిరి పమ్మిసాయి, ప్రవీణ్, ప్రియాంక, గోపిక ఉదయం, ప్రతీనేహ ఉన్నారు. ఎడిటర్‌గా ప్రవీణ్ పూడి, కెమెరామెన్‌గా ఆకాశ్ ఉండగా సంగీతాన్ని కృష్ణప్రసాద్ పనిచేస్తున్నారు.



ఓ సన్నివేశాన్ని తెరకెక్కిస్తున్న దృశ్యం

గోవా ఫిలిం ఫెస్టివల్ జ్యూరీ సభ్యుడిగా 'నామాన' నియామకం



రామదాసునాయుడు

కరప, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోవాలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవ వేడుక (ఐఎఫ్ఎఫ్ఐ-2025) జరగనుంది. ఇందులో భాగంగా నిర్వహించే హాకథాన్/ఏఐ ఫిలిం ఫెస్టివల్ విభాగానికి జ్యూరీ సభ్యుడిగా కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన దర్శక, నిర్మాత నామాన రామదాసునాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నుంచి ఉత్తర్వులు అందాయి. నాలుగు దశాబ్దాలుగా సినీ, టీవీ రంగాల్లో దర్శక, నిర్మాతగా రాణిస్తున్న రామదాసునాయుడు ఆంధ్రప్రదేశ్ నంది అవార్డుల జ్యూరీ మెంబర్‌గా, ఇంట ర్నేషనల్ చిల్డ్రన్ ఫిలిం ఫెస్టివల్ కమిటీ మెంబరుగా, ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సేవలందించారు. ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర ప్రభుత్వం నుంచి 10 నంది అవార్డులు అందు కున్నారు.రామదాసునాయుడు సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం తాజాగా ఐఎఫ్ఎఫ్ఐ-2025 ఏఐ ఫిలిం సెక్షన్‌కు జ్యూరీ మెంబరుగా నియమించింది. ఆయనకు గ్రామస్థులు, అభిమానులు, పలువురు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

22న నన్నయలో జాతీయ సెమినార్

దివాన్‌చెరువు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నైపుణ్యాభివృద్ధి కేంద్రం, భౌతికశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో ఇటీవల పరిణామాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు అనే అంశంపై సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో సెమినార్ జరుగుతుందన్నారు. కార్యక్రమం కన్వీనర్‌గా బి.జగన్మోహన రెడ్డి, కో-కన్వీనర్‌గా ఎస్.రాజ్యలక్ష్మి వ్యవహరిస్తారన్నారు. అధ్యాపకులు, పరిశోధకులు ఈసెమినార్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ, వర్సిటీ అధికారులు

కాకినాడ జీజీహెచ్‌లో వృద్ధులకు ప్రత్యేక ఓపీ సేవలు

23న ప్రారంభం

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో 65 ఏళ్లు పైబడిన వృద్ధుల సౌలభ్యం కోసం ప్రతి ఆదివారం ప్రత్యేక ఓపీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం జనరల్ మెడిసిన్‌కు సంబంధించిన వైద్యసేవలు ఈనెల 23న ప్రారంభం కానున్నాయి. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ చొరవతో జీజీహెచ్‌లో పనిచేసిన మెడిసిన్ విభాగ నిష్ణాతులు డాక్టర్ ఎంబీఆర్ శర్మ, డాక్టర్ కేఎస్ఆర్ స్వామి, డాక్టర్ సీఎస్ఎస్ శర్మ, డాక్టర్ రమణ్‌రావుతో కలిసి జీజీహెచ్ వైద్యులు షిఫ్టుల విధానంలో సేవలు అందించనున్నారు. ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపీ నడుస్తుందని సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లా వణ్యకుమారి తెలిపారు.

కాకినాడ జీజీహెచ్‌లో హృద్రోగ వ్యాధులకు రేపు స్క్రీనింగ్ పరీక్షలు

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 21వ తేదీన 18 ఏళ్లలోపు వయసు గల పిల్లలకు గుండె వ్యాధికి సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రీయ బాల స్వస్థ (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా విజయవాడ ఇండో బ్రిటీష్ హాస్పిటల్ సౌజన్యంతో జీజీహెచ్‌లోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఎవరికైనా గుండె వ్యాధి ఉందని నిర్ధారణ అయితే వెంటనే ఇండో బ్రిటీష్ హాస్పిటల్ వైద్యులు వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి. అరుణ పర్యవేక్షిస్తారని డీఎంహెచ్‌వో చెప్పారు.

కేంద్ర మంత్రి సతీమణి పూజలు



చిత్రపటం అందజేస్తున్న ఈవో నీలకంఠం

సామర్లకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రసహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సతీమణి వెంకటేశ్వరీదేవి, ఆమె కుటుంబ సభ్యులు బుధవారం కాకినాడ జిల్లా సామర్లకోటలోని భీమేశ్వరస్వామి ఆలయానికి విచ్చేశారు. వారికి ఈవో బళ్ల నీలకంఠం, ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్ (బాబు), వేదపండితులు సాదర స్వాగతం పలికారు. భీమేశ్వర స్వామికి అభిషేకం, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చనలు జరిపారు.

వాడపల్లి వెంకన్న ఆలయ అభివృద్ధికి కృషి

● విశాఖ ఎంపీ శ్రీభరత్



ఆలయాన్ని సందర్శిస్తున్న ఎంపీ భరత్, ఎమ్మెల్యే బండారు, తదితరులు

ఆత్రేయపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని విశాఖపట్నం ఎంపీ ఎం. శ్రీభరత్ పేర్కొన్నారు. బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. తొలుతగా అర్చక బృందం వేదమంత్రాలతో ఘనస్వాగతం పలికింది. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఎంతో మహిమాన్వితుడైన స్వామి వారు దేశవ్యాప్తంగా ఖ్యాతిని అర్జించారని ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తుందన్నారు. స్వామివారి అభివృద్ధిలో తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆలయ వద్ద రూ.1.16 కోట్లతో నిర్మిస్తున్న టెన్సిల్ షెడ్ నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. కేంద్రప్రభుత్వం ప్రసాదం స్కీమ్ రూ.96 కోట్ల నిధుల విడుదలకు తనవంతు కృషిచేస్తానని ఎంపీ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలలో వాడపల్లి ఆ స్థాయిలో అభివృద్ధి సాధించడం తథ్యమన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, ఆముడా చైర్మన్ అల్లాడ స్వా మినాయుడు, దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఆకుల రామకృష్ణ, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.59 కోట్లు

ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. పర్యవేక్షణాధికారులు వి.సత్యనారాయణ, జె.రామలింగేశ్వరరావు, వైవీవీ సత్యనారాయణల పర్యవేక్షణలో జరిగింది. మొత్తం 27 రోజులకు గాను రూ.1,30,38,579, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.29,06,170 వెరసి రూ.1,59,44,749 లభించింది. అలాగే బంగారం 15 గ్రాములు, వెండి 910 గ్రాములు, పలు దేశాల విదేశీ కరెన్సీ నోట్లు హుండి ద్వారా లభించించిన్నట్టు ఆలయ ఉపకమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈ లెక్కింపులో అర్చకులు, గ్రామస్థులు, సిబ్బంది, బ్యాంకు,పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపులో చేతివాటం

ఆలయ సన్నిధిలో బుధవారం నిర్వహించిన స్వామివారి హుండీ లెక్కింపులో ఓ సేవకుడు స్వామివారి నగదు తస్కరించాడు. వివిధ ప్రాంతాల నుంచి సేవకులు వస్తుంటారు. కానుకలు లెక్కిస్తున్న సమయంలో ద్రాక్షారామానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాసరావు అనే సేవకుడు రూ.60 వేల నగదు దొంగలిస్తుండగా ఆలయ సెక్యూరిటీ గార్డు పట్టుకుని దేవస్థానం అధికారులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

మత్స్యకారుల వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వం అండ : మంత్రి దుర్గేష్

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో మత్స్యకారుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో మత్స్య రైతులు, మత్స్యకారులను సహకార సంఘాల నుంచి సమృద్ధి వైపు నడిపించేందుకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కోరుమామిడి ది వడ్డీస్ ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీకి రూ. 2.54 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వంద మంది కన్నా ఎక్కువ ఉన్న మత్స్యకార సొసైటీలకు సంఘ కార్యకలాపాల కోసం సంవత్సరానికి రూ. 2.5 లక్షలు ఇస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో ఈ సొసైటీకి ఖర్చుల నిమిత్తం నిధులు రావడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఇదే ప్రథమమని ఆయన తెలిపారు. ఈ నిధుల ద్వారా కార్యాలయ నిర్మాణానికి, ఫర్నీచర్ ఏర్పాటుకు, మేనేజ్మెంటు చేసే సిబ్బంది వేతనానికి వినియోగించుకోవచ్చన్నారు. ప్రతి మత్స్యకారుడు నేషనల్ ఫిషరీ డెవలప్మెంట్ ప్లాట్‌ఫామ్‌లో రిజిస్టర్ అయివుండాలని, అలా అయివున్నవారికి వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ గ్యారంటీ సదుపాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో కోరుమామిడి మత్స్యకార సంఘాల ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో పీఎం మత్స్య సంపద యోజన చెక్కును అందిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారుడితో ఉపాధ్యాయులు

సామర్లకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో ఈనెల 22వ తేదీ నుంచి 24 వరకు జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.వెంకట శ్రీరామ్ ఎంపికయ్యాడని ఆ పాఠశాల హెచ్ఎం కె.ప్రసన్న, వ్యాయామ టీచర్ బి.శివ తెలిపారు. బుధవారం వీరిద్దరు మాట్లాడుతూ అలాగే అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు కూడా ఎంపికైనట్టు హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. అండర్-14 కబడ్డీ బాలుర విభాగంలో కె.అభిరామ్, ఖోఖో బాలికల విభాగంలో జి.వర్షిణి, బాలుర విభాగంలో డి.గౌతమ్‌కుమార్ ఎంపికయ్యారు.

సత్యదేవా.. సంఖ్య తగ్గే!

● గతేడాది కార్తీకం కంటే ఈ ఏడాది తగ్గనున్న సత్యదేవుడి వ్రతాలు
● మొంథా తుఫాన్ ప్రభావంతో సుమారు 10 వేల వ్రతాల్లో కోత
● నేటితో ముగియనున్న కార్తీకమాసం

అన్నవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో ఏటా కార్తీమాసంలో అధికసంఖ్యలో వ్రతాలు జరుగుతుంటాయి. అయితే ఈసారి మాత్రం ఆ సంఖ్య భారీగా తగ్గనుంది. తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి కార్తీకమాసంలో సత్యదేవుడి వ్రతాలు ఆచరిస్తారు. ఏడాదిలో జరిగే వ్రతాల్లో సుమారు 20 శాతం కార్తీకమాసంలో జరుగుతుండడం విశేషం. గతేడాది కార్తీకమాసంలో 1,45,732 వ్రతాలు జరగగా ఈ ఏడాది 1.50 లక్షలు జరుగుతాయని అధికారులు అంచనా వేశారు. గురువారంతో కార్తీకమాసం ముగియనుండగా బుధవారంతో 133644 వ్రతాలు జరగగా గతేడాది కంటే 12088 వ్రతాల లోటులో ఉంది. గురువారం అమావాస్య కారణంగా కేవలం 2వేల వ్రతాలు జరి గే అవకాశాలు ఉన్నాయి. మొత్తంమీద గతేడాది కంటే సుమారు 10 వేల వ్రతాల లోటు కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం కార్తీకమాసం ప్రారంభంలో మొంథా తుఫాన్ ప్రభావం పడింది. ఈ తుఫాన్ భయంకరంగా ఉంటుందని, కాకినాడ ప్రాంతంలో తీరం దాటుతుందని హెచ్చరికల నేపథ్యంలో భక్తులు వెనకడుగు వేశారు. ఆ సమయంలో భక్తులు పూర్తిస్థాయిలో వచ్చి ఉంటే 1.50 లక్షలు వ్రతాలు జరిగి గతేడాది రికార్డును అధిగమించే అవకాశం ఉండేది. కానీ అలా జరగకుండా వ్రతాల సంఖ్య తగ్గింది.


వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు (ఫైల్)

అడవి నుంచి జనావాసాల్లోకి..

» 'ఆపరేషన్ కగార్' ధాటికి 'తూర్పు' వైపునకు చేరిన మావోలు
» గతేడాది జూన్‌లో గుడిసె పరిసరాల్లో రహస్య సమావేశం
» అప్పటి నుంచి వారి కదలికలపై కేంద్ర బలగాల ప్రత్యేక నిఘా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'ఆపరేషన్ కగార్'తో మావోయిస్టు పార్టీ కకావికలం అయిపోయింది. చివరి మావోయిస్టును కూడా హతం చేసి ఆ పార్టీని తుదముట్టించాలని కేంద్రం గట్టిగానే నిర్ణయం తీసుకొంది. దీంతో ఆక్టోపస్, గ్రేహౌండ్స్, సీఆర్పీఎఫ్.. ఇలా అత్యంత చురుకుదనం కలిగిన నిఘా వర్గాలను రంగంలోకి దింపింది. వాళ్లకు అధునాతన ఆయుధ సంపత్తిని అందజేసింది. ఛత్తీస్‌ఘడ్ అడవుల్లోని గిరిజన గ్రామాలను, వ్యక్తులకు జియో ట్యాగింగ్ చేశారంటే ఏ స్థాయిలో మావోయిస్టులను చుట్టుముట్టారో అర్థం చేసుకోవచ్చు. ఆపరేషన్ కగార్‌ను డిసెంబరు చివరి నాటికి ముగించాలని కేంద్రం ఆదేశించింది. అడిషనల్ డీజీ మహేశ్ చంద్ర లడ్డా నేతృత్వంలో అనుకున్న పనిని పది రోజులకు ముందే కానిచ్చేశారు. ఆపరేషన్ కగార్ ధాటికి అన్నలు అడవిని వీడి జనారణ్యంలోకి వచ్చేశారు. ఈ నేపథ్యంలోనే ఏలూరు, విజయవాడ, రావులపాలెం, సామర్లకోట తదితర ప్రాంతాల్లో కొందరు పోలీసులకు చిక్కినట్టు సమాచారం. దీంతో సరిహద్దులో ఎవరున్నారు? జనంలో ఎవరు కలిసి తిరుగుతున్నారు? ఎప్పుడు ఏం జరుగుతుందనే ప్రతిష్ఠంభన రాజ్యమేలుతోంది. నక్సల్‌బరీ ఉద్యమం తొలి నాళ్లలో ఉమ్మడి తూర్పుగోదావరిలోని మారేడుమిల్లి, రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాల్లో పోరుబాట ఉధృతంగా ఉండేది. రాత్రివేళల్లో సంచరించడానికి కూడా పరిస్థితులు భయపెట్టేవి. ఆ తర్వాత ఏపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం, చర్చలు విఫలం కావడం వంటి పరిణామాలతో మావోలు ఏవోబీ వైపునకు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణలకు తరలిపోయారు.



● ఇదే జరిగిందా?

ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో నక్సలైట్ల ఏరివేతలను ఉధృతం చేశారు. దీంతో వాళ్లు మళ్లీ ఆంధ్రానే షెల్టర్ జోన్‌గా ఎంచుకున్నారు. హిడ్మా కూడా ఓ వైపు లొంగిపోతానని సంకేతాలు పంపుతూనే తన పని తాను చేసుకుపోతున్నాడు. కొద్దినెలలక్రితం త్వరలోనే తాను లొంగిపోతాన ని, మధ్యవర్తిత్వం సాగించాలని ఓ విలేకరికి వర్తమానం పంపినట్లు చెప్తున్నారు. ఈ క్రమం లోనే గత జూన్, జూలై నెలల్లో మారేడుమిల్లి సమీపంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గుడిసెకు దగ్గరలోని అడవుల్లో మావోయిస్టుల కీలక సమావేశం జరిగింది. ఆ నెలల్లో గుడిసెలో నిర్వహణ, రోడ్ల మరమ్మతుల నిమిత్తం పర్యాటకులను ఆపేశారు. అదే అదనుగా అక్కడ బస చేసి మావోయిస్టులు సమావేశాలు నిర్వహించారు. వాళ్లు వెనుదిరిగిన వారం రోజుల తర్వాత పోలీసులకు ఈ విషయం తెలిసింది. దీంతో రంగంలోకి దిగి ఆరా తీశారు. మావోయిస్టులకు ఆహారం, ఇతర వస్తువులు సరఫరా చేసిన వాళ్లపై కేసులు పెట్టారు. వాటిని పోలీసులు బయటకు రానివ్వలేదని తెలిసింది. దీన్ని వ్యూహంలో భాగం చేశారు. ఆపరేషన్ కగార్‌లో టాప్ లీడర్లపైనే దృష్టిసారించారు. వాళ్లను అంతమొందిస్తూ వస్తున్నారు. జూన్, జూలై నెలల్లో వందల సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల చేతుల్లో చనిపోయారు. టాప్ లీడర్లు కలుగులోంచి బయటకు వస్తున్నారని గుడిసె సమావేశం తర్వాత పోలీసులు అంచనాకు వచ్చారు. ఈ క్రమంలో కాకినాడ పోర్టు నుంచి శ్రీలంకకు మాడ్వీ హిడ్మా, అతడి భార్య, మరో ముగ్గురు నలుగురు ముఖ్యులు వెళ్లే ప్లాన్ వేశారు. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో కొంతకాలంపాటు చడీచప్పుడు లేకుండా ఉండాలని వారు భావించి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఈనేపథ్యంలో హిడ్మా, అతడి భార్య, పదుల సంఖ్యలో వివిధ క్యాడర్లలోని మావోయిస్టులు విభజిత తూర్పు, కాకినాడ జిల్లాలకు పయనమయ్యారని తెలుస్తోంది. ఈ పయనంలో వాళ్లు ఉండగా.. అప్పటికే పక్కా సమాచారంతో ఉన్న కేంద్ర బలగాలు మాటువేసి వారిని ఎన్‌కౌంటర్ జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. మంగళవారం ఆరుగురు, బుధవారం ఏడుగురు మరణించగా.. మరో నలుగురు మావోయిస్టులు పోలీసుల చెరలో ఉన్నారని, వారిని హతమార్చడమా? అరెస్టు చూపించడమా? అనే సందిగ్ధంలో పోలీసులు ఉన్నారని తెలుస్తోంది.


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో చింతూరు పోలీసులు

తవుడు కింద గంజాయి బస్తాలు

పట్టుకున్న చింతూరు పోలీసులు
రూ.6 లక్షల విలువైన 120 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్

చింతూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు బుధవారం 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రమేష్ కథనం మేరకు... ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా ఎంవీ 71 గ్రామానికి చెందిన బిశ్వజిత్ మండల్, సుదీప్ హల్దార్ 120 కిలోల గంజాయిని ఏపీలోకి తరలించేయత్నం చేశారు. బొలేరా వాహనంలో తవుడు లోడు వేసుకుని ఆ లోడు కింద భాగంలో ఎవరికీ అనుమానం కలగకుండా గంజాయి బస్తాలను పేర్చారు. కాగా ఒడిస్సా జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.6 లక్షల వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోపై వైద్యుల ఫిర్యాదులు

డిసెంబరు 4న విచారణ

చింతూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.పుల్లయ్యపై పలువురు వైద్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డిసెంబరు 4న విచారణకు హాజరుకావాల్సిందిగా ఇరుపక్షాలకు ఆదేశాలు అందాయి. విచారణ చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో జరగనుంది. చింతూరు డివిజనులోని కూనవరం, కూటూరు, తులసిపాకల, రేఖపల్లి, జీడిగుప్ప ప్రాథమిక వైద్యశాలల వైద్యాధికారులకు.. పుల్లయ్యకు నడుమ దాదాపు ఏడాదిగా పొసగడం లేదు. దీనిపై ఎవరి వాదన వారిదిగా ఉంది. తాజాగా ఎటపాక మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక వైద్యశాల అధికారి, పుల్లయ్యకు నడుమ కూడా వివాదం రాజుకుంది. దీంతో లక్ష్మీపురం వైద్యాధికారి ఏకంగా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి పుల్లయ్యపై పలు ఆరోపణలు చేసిన విషయం విధితమే. ఇదిలా ఉండగా కూటూరు, కూనవరం, రేఖపల్లి, తులసిపాకల, జీడీగుప్ప వైద్యులు డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ జాయింట్ డైరక్టర్ (డీపీహెచ్ఎఫ్ డబ్ల్యు)కు పుల్లయ్యపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అధికార దుర్వినియోగం, వేధింపులు, బెదిరింపులు, మానసిక హింస, ప్రాథమిక సేవా హక్కులతో కూడిన, గౌరవాన్ని తిరస్కరించడం ప్రైవేటు ప్రయోజనాలకు ప్రభుత్వ సేవలను మళ్లించడం, ఆర్థిక దుష్ప్రవర్తన, ప్రతీకారం తదితర చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు డీపీహెచ్ఎఫ్‌డబ్ల్యు స్పందించి విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా నేషనల్ ప్రోగ్రాం ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ అండ్ విజువల్ ఇంపెయిర్‌మెంట్ (ఎన్‌పీసీబీబిఐ) జాయింట్ డైరక్టర్ సునీల్‌కుమార్ నాయక్‌ను నియమించారు. ఆ మేరకు డిసెంబరు 4న విచారణ అధికారి చింతూరు రానున్నారు. విచారణ తదుపరి ఎటువంటి పరిణామాలు చర్యలు తీసుకుంటారో చూడాల్సింది ఉంది.

కుండలేశ్వరస్వామి దర్శనానికి వచ్చి గుండెపోటుతో భక్తురాలు మృతి

కాట్రేనికోన, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరస్వామిని దర్శనానికి ఒక భక్తురాలు విశాఖ నుంచి బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కుండలేశ్వరం వచ్చింది. స్వామిని దర్శించి అన్న ప్రసాదాన్ని స్వీకరించింది. ఆలయం బయట కూర్చుని విశ్రాంతి తీసుకుంటూ గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన కుండలేశ్వర క్షేత్రంలో విషాదం నింపింది. వివరాల ప్రకారం.. విశాఖకు చెందిన బొట్టా నిర్మల (67) బుధవారం కుండలేశ్వరం వచ్చి గోదావరిలో స్నానమాచరించి ఎంతో భక్తితో స్వామిని ఆరాధించింది. అన్న ప్రసాదం తీసుకున్న తర్వాత ఆలయం వద్ద బయట కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేందుకు కూర్చుంది. అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలింది. అక్కడ ఉన్న భక్తులు, ఆలయ సిబ్బంది తక్షణం స్పందించినా ఫలితం లేకపోయింది. పవిత్ర కుండలేశ్వర స్వామి సన్నిధిలో తనువు చాలించిన నిర్మల అదృష్టానికి ఆనందపడాలో, దైవదర్శనానికి వచ్చి మృత్యువాత పడినందుకు విచారించాలో తెలియని అయోమయ పరిస్థితిలో తోటి భక్తులు సతమతమయ్యారు.


వివరాలు వెల్లడిస్తున్న అమలాపురం సీఐ

డబ్బు కోసమే బాలిక కిడ్నాప్

● నిందితుడి అరెస్టు
● 14 రోజుల రిమాండ్
● వెల్లడించిన అమలాపురం సీఐ వీరబాబు

అమలాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఇటీవల సంచలనం కలిగించిన బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు అమలాపురం సీఐ పి.వీరబాబు వెల్లడించారు. డబ్బు కోసమే బాలికను కిడ్నాప్ చేశాడని, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరుచగా 14 రోజుల రిమాండ్ విధించారని పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి వివరాలు సీఐ వీరబాబు బుధవారం విలేకర్లకు వివరించారు. ఈనెల 10న అమలాపురంలో స్కూలు నుంచి వస్తున్న పదేళ్ల బాలికను వరుసకు మామయ్య అయిన మట్టపర్తి దుర్గానాగసత్యమూర్తి (చంటి) మోటారు సైకిల్‌పై వచ్చి కిడ్నాప్ చేసి కాకినాడ తీసుకెళ్లాడు. బాలికను క్షేమంగా అప్పగించాలంటే తాను పంపిస్తున్న యూపీఐ క్యూఆర్ కోడ్‌కు డబ్బులు పంపించాలని బాలిక తల్లిదండ్రులను బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. అయితే బాలిక తండ్రి కముజు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అమ లాపురం పట్టణ పోలీసులు డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పర్యవేక్షణలో విచారణ కోసం బృందాలను ఏర్పాటు చేశారు. ఎస్ఐలు టి.శ్రీనివాస్, జోషి మూడు బృందాలుగా ఏర్పడి కాకినాడ, పి.గన్నవరం, ముంగండ, పోతవరం, కారుపల్లి గ్రామాల్లో ముమ్మరంగా గాలించారు. కిడ్నాప్ అయిన 11 గంటలోనే బాలిక ఆచూకీని గుర్తించి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మట్టపర్తి దుర్గానాగసత్యమూర్తి అలియాస్ చంటిని పోతవరం గ్రామంలో బుధవారం సీఐ వీరబాబు పర్యవేక్షణలో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది అరెస్టు చేశారు. అతడి నుంచి నేరానికి ఉపయోగించిన మోటారు సైకిల్, 2 సెల్‌ఫోన్లు, బాలిక స్కూలు బ్యాగు, లంచ్‌బాక్సు, జత స్కూలు షూలు స్వాధీన పరచుకున్నారు. అతడిని అమలాపురంలో అడిషనల్ జ్యుడిషీయల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ తెలిపారు. నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసును చేధించడంలో కృషి చేసిన ఎస్ఐలు, సిబ్బందిని సీఐ వీరబాబు అభినందించారు.

జాహ్నవి మృతదేహం లభ్యం


జాహ్నవి మృతదేహం

మలికిపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దిండి-చించినాడ వద్ద గోదావరిలో తండ్రి ఇద్దరు పిల్లలను తోసి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సంఘటనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా లక్కవరం గ్రామానికి చెందిన తండ్రి శిరిగినీడి దుర్గాప్రసాద్, కుమారుడు మోహిత్ మృతదేహాలు మంగళవారం లభ్యం కాగా బుధవారం ఉదయం కుమార్తె జాహ్నవి మృతదేహం లభ్యమైంది. ముగ్గురి మృతదేహాలకు రాజోలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అందజేస్తామని పోలీసులు తెలిపారు. ఒకే కుటుంబంలోని ముగ్గురు మృతిచెందడం ఈ ప్రాంతవాసులను కలవరపరిచింది. ఘటనపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు మలికిపురం పోలీసులు తెలిపారు.

కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

కడియం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం నుంచి కడియం వెళ్లే కాలువలో సుమారు 30 నుంచి 40 ఏళ్ల గల మహిళ మృతదేహం నీటిలో తేలియాడుతున్నట్టు బుధవారం స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని వేమగిరిగట్టు వద్ద ఒడ్డుకు తీయించి పరిశీలించారు. మృతదేహంపై వంగపూవు రంగు చీర, బ్లౌజు ఉన్నాయి. మెడలో నల్లపూసల తాడు, కాళ్లకు మెట్టెలు ఉండడంతో వివాహితగా పోలీసులు గుర్తించారు. వేమగిరి గ్రామ రెవెన్యూ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడియం పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.సురేష్ కేసు నమోదు చేశారు. మహిళ వివరాలు తెలిస్తే కడియం పోలీసుస్టేషన్‌కు తెలియపరచాలనికోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అద్దరిపేట విద్యార్థి


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జగదీష్

తొండంగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు కాకినాడ జిల్లా తొండంగి మండలం అద్దరిపేట విద్యార్థి పిక్కి జగదీష్ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు దుర్గాకుమారి తెలిపారు. ఈనెల 18న కాకినాడలో జరిగిన 300 మీటర్ల పరుగు పందెంలో జగదీష్ జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలిచ ఈనెల 29న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీలకు ఎం పికయ్యాడన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచి జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జగదీష్, వ్యాయామోపాధ్యాయులు మునుకోటి దుర్గాప్రసాద్‌ను అభినందించారు.

అంగన్‌వాడీకి వెళ్లి.. అంతలోనే కన్నుమూసి!

ఫిట్స్‌తో ఐదేళ్ల చిన్నారి మృతి

చింతూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఫిట్స్ బారిన పడి ఐదేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన అల్లూరి జిల్లా చింతూరు మండలంలోని కుయుగూరులో బుధవారం జరిగింది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల మేరకు.. పెద్దసీతనపల్లికి చెందిన శ్యామల మారయ్య, రమాదేవి దంపతుల కూతురు జనని (5) కుయుగూరులోని అమ్మమ్మ రవ్వ దుర్గమ్మ ఇంటి వద్దనే ఉంటూ అంగన్‌వాడీలో చదువు కుంటుంది. ఈ క్రమంలో బుధవారం సమీపంలోని అంగన్‌వాడీ సెంటరుకు వెళ్తూ మార్గమధ్యలో రేగికాయల చెట్టు వద్ద కింద పడి ఉన్న పండ్లను ఏరుకుని తింటూ అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లింది. కాగా కొద్ది నిమిషాల వ్యవధిలో జననికి ఫిట్స్ వచ్చాయి. విషయం తెలుసుకున్న జనని అమ్మమ్మ దుర్గమ్మ కుటుంబసభ్యులందరూ జననిని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు జనని అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారని ఎస్ఐ తెలిపారు.


మృతిచెందిన చిన్నారి జనని

చోరీ కేసుల్లో నిందితుడికి ఆరు నెలల జైలు

కాకినాడ క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తూ దొరికిన వ్యక్తిపై నేరారోపణ రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ మూడో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి.శ్రీదేవి బుధవారం తీర్పు చెప్పారు. కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన 42 ఏళ్ల కాట్లోజు లోవరాజు గతంలో బంగారం పనిచేసేవాడు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ద్విచక్ర వాహనాలను తస్కరించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో పార్క్ చేసిన మోటారు వాహనాలను ఎత్తుకెళ్లి అమ్ముకుని జల్సా చేసేవాడు. ఈ విధంగా ఏడు కేసుల్లో నిందితుడైన లోవరాజును కాకినాడ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో వాదోపవాదనల అనంతరం అతడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కె.సుధారాణి వాదించారు.

గంట పడుకుని నిద్ర లేస్తానని చెప్పి..

కాపవరంలో ఉరేసుకున్న యువకుడు
కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు


నీలకంఠేశ్వరుడు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రవిచంద్రకుమార్

బిక్కవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కాపవరంలో పోసిన నీలకంఠేశ్వరుడు (26) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కాపవరానికి చెందిన నీలకంఠేశ్వరుడు అనపర్తి ఐఎల్‌టీడీ ఫ్యాక్టరీలో కూలీ పని చేస్తుంటాడు. మంగళవారం పనికి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చి పడుకున్నాడు. బుధవారం ఉదయం అతడి తల్లి నిద్రలేపగా రాత్రి లేటుగా వచ్చానని.. ఒక గంట పడుకుని లేస్తానని చెప్పి మళ్లీ పడుకున్నాడు. మళ్లీ నిద్ర లేపడానికి తల్లి ప్రయత్నించగా తలుపు వేసి ఉంది. దీంతో ఎంతకొట్టినా తలుపు తీయకపోవడంతో పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. నీలకంఠేశ్వరుడు మృతదేహాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు. మృతుడికి ముగ్గురు సోదరులు ఉన్నారు. వారికి పెళ్లిళ్లు అయిపోయాయి. నీలకంఠేశ్వరుడికి ఏ బాధలు లేవని, ఉరి వేసుకుని చనిపోవడానికి కారణాలు తెలియరావడం లేదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

విహారయాత్రలో విషాదం

కాలువలో యువకుడి గల్లంతు


జగదీష్ (ఫైల్)

మోతుగూడెం/చింతూరు, నవనంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొల్లూరు జల విద్యుత్ ఉత్పాన కేంద్రానికి చెందిన కాలువలో మునిగి గనిశెట్టి జగదీష్(26) గల్లంతయ్యాడు. ఈ ఘటన బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నుంచి గనిశెట్టి జగదీష్, బీ.చిరంజీవి, కె.భాను, ఆర్.రాందేవ్, పీ.నాగేంద్ర, బీ.హరి మోతూ గూడెం జలపాతాల విహారయాత్రకు కారులో కలిసి వచ్చారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో వారంతా బోర్‌బే వద్దకు చేరుకున్నారు. తదుపరి జగదీష్, నరేంద్ర, భాను కాలువలో స్నానానికి దిగారు. కాలువ ప్రవాహం ఉధృతి అవుతుండడంతో జగదీష్ మినహా మిగిలిన ఇద్దరు ఒడ్డుకు చేరుకున్నారు. జగదీష్ కూడా ఒడ్డుకు చేరేం దుకు ప్రయత్నం చేస్తుం డగానే ప్రవాహంలో కొట్టు కుపోయాడు. మిగిలిన వారంతా జగదీష్‌ని రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. సాయంత్రం 6 గంటల వరకు కాలువలో గాలించినప్పటికీ జగదీష్ ఆచూకీ లభ్యం కాలేదు. రాందేవ్, జగదీష్ బావ బామ్మర్దులు. రాందేవ్ మోతుగూడెం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశాడు. కాగా వారంతా డ్రైవింగ్, మెకానిక్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జగదీష్ గల్లంతు కావడంతో ఎంతో విలపిస్తున్నారు.


విహారయాత్రలో స్నేహితులు దిగిన ఫొటో

రాత్రి లాడ్జిలో రూం తీసుకుని..

ఉదయం డ్రైనులో శవంగా కనిపించి..

పురుగుల మందుల కంపెనీ ఉద్యోగి అనుమానాస్పద మృతి
కేసు నమోదు చేసిన పోలీసులు

రాజమహేంద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాత్రి లాడ్జి రూం తీసుకున్న వ్యక్తి.. ఉదయానికి అదే లాడ్జి పక్కన డ్రైనులో శవమై కనిపించాడు. రాజమహేంద్రవరం త్రీటౌన్ ఎస్ఐ సుభాని తెలిపిన వివరాల ప్రకారం... నూజివీడుకు చెందిన టి.చెన్నారావు (38) ఓ పురుగుల మందుల కంపెనీలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల అసిస్టెంట్ సేల్స్ మేనేజరుగా ఇటీవల ఉద్యోగంలో చేరాడు. విధుల్లో భాగంగా మంగళవారం పశ్చిమ గోదావరిలోని దుకాణాలకు వెళ్లి పని చూసుకుని సాయంత్రానికి మరొకరితో కలిసి రాజమండ్రి చేరుకున్నాడు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన బాధ్యులు ఇద్దరితో కలిసి రాత్రి 4వ అంతస్తులో ఉన్న రూంలో మద్యం తాగి ఉండొచ్చని ఎస్ఐ పేర్కొన్నారు. కారు డ్రైవర్లు వేరేక రూంలో నిద్రిస్తున్నారని, తెల్లవారుజామున 5.30గంటల ప్రాంతంలో చెన్నారావు బాల్కనీలోకి వచ్చి ప్రమాదవశాత్తు పడిపోయి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నామన్నారు. ఉదయం డ్రైనులో మృదేహాన్ని గమనించిన స్థానికుల సమాచారం మేరకు మార్చురీకి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు.


డ్రైనులో చెన్నారావు మృతదేహం

ఉలిగోగులలో భూ వివాదం

20 జీడిమామిడి చెట్లు నరికి వేత

ప్రత్తిపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ బురదకోట పంచాయతీ పరిధిలో ఉన్న ఉలిగోగుల గిరిజన గ్రామంలో భూ వివాదం ఏర్పడింది. గిరిజనులు భూముల్లో పెంచుతున్న పెంచుకున్న 20 జీడిమామిడి చెట్లను గిరిజనేతరులు నరికి వేయడంతో బుధవారం ఈ వివాదం వచ్చింది. చెట్లు నరికివేత దారులు, గిరిజనుల మధ్య వివాదం కారణంగా ప్రత్తిపాడు పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. ఉలిగోగులలో కాపూరి లవకుశలు, కాపూరి వెంకటలక్ష్మి, సిద్ద బూరమ్మలు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న 20 ఎకరాల భూముల్లో రూ.10లక్షల విలువైన చేసే తమ జీడిమామిడి చెట్లను అన్యాయంగా నరికి వేశారని బాధితులు వాపోయారు. 20 ఎకరాల భూముల వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉందని, ఈ భూమిపై హక్కులు కోర్టు నిర్ధారించుకుండానే గిరిజనేతరులు దౌర్జన్యాలకు దిగుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వివాదాస్పద భూముల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు సంఘటనా స్థలానికి తరలివచ్చారు.


ఉలిగోగులలో నరికి వేసిన జీడిమామిడి చెట్లు

కాకినాడ

కట్టమూరులో భారీ అన్నదానం

పెద్దాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరు రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద బుధవారం భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు ఆరువేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



పిఠాపురంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నమూనా చెక్కు అందజేస్తున్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు



కాకినాడలో జరిగిన రైతు సంబర సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు



కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం రెండో విడత

చెక్కుల పంపిణీ సభల్లో ప్రజాప్రతినిధులు

పిఠాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు పేర్కొన్నారు. పట్టణంలోని రథాలపేట సెంటర్లో గల అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 23,105 మంది రైతులకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.15.02 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, ఓదూరి కిషోర్, పాడా పీడీ చైత్రవర్షిణి, వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, ఏఎంసీ చైర్పర్సన్ వాకపల్లి దేవి తదితరులు పాల్గొన్నారు. కాగా టీడీపీ, జనసేన కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేసుకున్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): రైతు సంబర సభ పేరిట కాకినాడ అర్బన్ తహసీల్దారు కార్యాలయ ఆవరణలో బుధవారం అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం రెండో విడత నిధుల జమ కార్యక్రమాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సారథ్యంలో నిర్వహించారు. కడప జిల్లా కమలాపురంలో సీఎం చంద్రబాబు లైవ్ ప్రసంగాన్ని ఎల్ఈడీ స్ర్కీన్‌పై రైతులతో కలిసి ఎమ్మెల్యే వీక్షించారు. వారితో కలిసి భోజనం చేశారు. కాకినాడ అర్బన్ తహసీల్దారు వి.జితేంద్ర, టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కాకినాడ వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, నాయకులు గదుల సాయిబాబా, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, పంతాడి రాజు, నల్లారి శ్రీనివాస్, సీకోటి అప్పలకొండ, అమలకంట బలరామ్, మల్లాడి గంగాధరం, మేడిశెట్టి చిన్ని, పల్లా సురేష్, జొన్నాడ వెంకటరమణ, నేమాని సత్యనారాయణ, బడేటి దేవి తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించి దేశానికి ఆహారం అందిస్తున్న రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. రమణయ్యపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం రెండో విడత కింద కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కాకినాడ రూరల్, కరప మండలాలకు చెందిన 10,076 మంది అర్హులైన రైతులకు రూ.6.86 కోట్ల చెక్కులను ఎమ్మెల్యే నానాజీ అందజేశారు. ఎంపీడీవో పసుపులేటి సతీష్, టీడీపీ కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్, శాలివాహన, ఎస్సీ, గౌడ, కార్పొరేషన్ల డైరెక్టర్లు శిరంగు శ్రీనివాసరావు, భీమాబత్తుల సత్యనారాయణ, కె.అప్పారావు, ఎం.ప్రకాశ్‌గౌడ్, రంబాల వెంకటేశ్వరరావు, వ్యవసాయ అధికారులు చీకట్ల సత్యనారాయణ, ఐ.సత్య పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ మెహర్ తేజలకు పురస్కారం అందజేస్తున్న రవికుమార్

'చేయూత' పురస్కారం ప్రదానం

కాకినాడ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా నయన కంటి ఆసుపత్రి అధినేత డాక్టర్ రావుల శ్రీరామ్, డాక్టర్ రావుల మెహర్‌తేజలకు చేయూత పురస్కారం అందజేశారు. వారిని చేయూత వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మొండి రవికుమార్, ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలకు అన్ని విధాలా సహకరిస్తున్న ప్రముఖులకు పురస్కారాలు అందజేస్తున్నామని చెప్పారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సామర్లకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం, పట్టణ పరిధిలో 15 మంది లబ్ధిదారులకు సుమారు రూ.3.80 లక్షలు విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరి నారాయణ, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం అందజేశారు. పాలకుర్తి శ్రీనుబాబు, చల్లా బుజ్జి, అడబాల కుమారస్వామి, చీకట్ల వెంకటేష్, గుమ్మళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు

విజేతలకు బహుమతుల అందజేత

తాళ్లరేవు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా పోలేకుర్రు ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ బీవీఎస్ఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. సుమారు 100 మందికి సర్టిఫికెట్లు అందించారు. పోలేకుర్రు, తోటపేట పాఠశాలల విద్యా కమిటీల చైర్‌పర్సన్లు శ్రీనివాస్, వరలక్ష్మి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

'పరివర్తన' బాలలకు దుస్తులు పంపిణీ

కాకినాడ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హెల్త్ అవేర్ సభ్యుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మరో సభ్యురాలు బాలాత్రిపురసుందరి తన కుమార్తె సాయి జయమాధురి పుట్టినరోజు సందర్భంగా బుధవారం పరివర్తన వీధి బాలల హోంలో కేక్ కట్ చేసి బాలలకు 60 జతల దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బీసీ కార్పొరేషన్ డైరెక్టర్, హెల్త్ అవేర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాలలు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పరివర్తన హోం నిర్వాహకుడు బాలాజీ, బాలాత్రిపురసుందరి, రామదేవు దుర్గాప్రసాద్, లక్ష్మీదీపు, మల్లుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

'మహిళ విద్యతో సమాజాభివృద్ధి'

కాకినాడ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళ విద్యావంతురాలైతే సమాజం అంతా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి, మహిళా దినోత్సవం, మహిళా సాధికారితపై చర్చ నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు, ఉప గ్రంథాలయ అధికారి కె.కిషోర్, సీనియర్ అసిస్టెంట్ శ్రావ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉక్కు మహిళ ఇందిరమ్మ సేవలు ఎనలేనివి'

కాకినాడ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశాన్ని అగ్రగామిగా నిలిపిన ఉక్కు మహిళ ఇందిరమ్మ సేవలు ఎనలేనివని కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్క నూకరాజు పేర్కొన్నారు. ఇందిరాగాంధీ 108వ జయంతి సందర్భంగా జగన్నాథపురం ఉమెన్స్ కాలేజీ వద్ద గల ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐసీసీ సభ్యుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, పీసీసీ సభ్యులు కుక్కల పోతరాజు, పోలిశెట్టి శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ మొయ్యేటి సూర్యప్రకాశరావు, డీసీసీ ఉపాధ్యక్షుడు పబ్బినీడి కృష్ణ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు బత్తుల లలిత, నాయకులు దవులూరి ధనకోటి, తుమ్మలపల్లి చిన్న, గరుగా వీరేంద్ర, శేరు వీరబాబు, పిక్కి నాగరాజు పాల్గొన్నారు.



జగన్నాథపురంలో ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



శివాలయం వద్ద కోటి దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

గొల్లప్రోలులో వైభవంగా కోటి దీపోత్సవం

గొల్లప్రోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో కోటి దీపోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. శివాలయం వద్ద కోటి ఒత్తులతో ఉన్న దీపపు కుందెలను 108 మంది దంపతులు వెలిగించారు. అంతకు ముందు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. దీపం కుందెలు కాంతులీనుతుండగా భక్తులు శివనామస్మరణ చేశారు. తొలుత ఉమారామలింగేశ్వరస్వామి శాంతి కల్యాణం జరిగింది. ఉదయం 108 మంది దంపతులతో రుద్ర సహిత చండీ హోమం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో గణపతి పూజ, చండీ మంటపారాధన, చండీ పారాయణ జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



స్కాలర్‌షిప్‌లు, కుట్టుమిషన్, వినికిడి యంత్రాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రెడ్ కాన్వెంట్ విద్యార్థుల సేవా నిరతి

కాకినాడ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్‌ల్యాబ్ ఆవరణలో గల రెడ్ కాన్వెంట్ విద్యార్థుల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గురు పేద విద్యార్థులకు రూ.55 వేలు విలువైన స్కాలర్‌షిప్‌లను చెక్కుల రూపంలో, ఒక పేద మహిళకు కుట్టుమిషన్, రెటీనా వ్యాధితో బాధపడుతున్న కె.గోపాలరెడ్డికి రూ.25వేలు విలువైన ఇంజక్షన్, జి.సత్యనారాయణకు రూ.50 వేలు విలువైన రెండు వినికిడి యంత్రాలను పూర్వ విద్యార్థి ఎం.శ్రీనివాసరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు బాదం బాలకృష్ణ, కోశాధికారి జగన్నాథరావు, రమణమూర్తి, పాపారావు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సూర్యుడు చెరువు వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలి'

గొల్లప్రోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని మొగలి సూర్యుడు మంచినీటి చెరువు చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పట్టణానికి చెందిన పలువురు బుధవారం నగర పంచాయతీ కమిషనరు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేయాలని, చుట్టూ విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

పీఎంశ్రీ నిధులతో సైన్స్ ప్రయోగశాల

సర్పవరం జంక్షన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకంలో రమణయ్యపేట ఏపీఎస్పీ జడ్పీ హైస్కూలు ప్లస్‌లో రూ.1.10 కోట్లతో నిర్మించిన సైన్స్ ప్రయోగశాలను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవో నెం.117తో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టనుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని కరప, కాకినాడ రూరల్ మండలాల్లో అధికంగా మోడల్ స్కూల్స్ ఎంపికకు కృషి చేసిన డీఈవో పిల్లి రమేష్‌ను అభినందించారు. హైస్కూలు ప్లస్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణ పనులను సీఎస్ఆర్ నిధులతో పూర్తి చేయాలని కోరమాండల్ సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే కోరారు. కబడ్డీ, ఖోఖో క్రీడా మైదానాన్ని ప్రారంభించారు. తెలుగు స్కూలు అసిస్టెంట్ రామలక్ష్మి ఆర్థిక సహకారంతో 75 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ టీ షర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, డీఈవో పిల్లి రమేష్, ఎంఈవో-1 తుమ్మల సత్యరంగారావు, హైస్కూలు హెచ్ఎం సత్యవోలు శ్రీనివాసరావు, హైస్కూలు ప్లస్ ఇన్‌చార్జి కందుకూరి పాల్‌రాజ్, కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, తాటికాయల వీరబాబు, రామిరెడ్డి సునీల్, రంబాల వెంకటేశ్వరరావు, పాండ్రంకి రాజు, కాకరపల్లి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రయోగశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ పద్మశ్రీ, డీఈవో రమేష్



అన్నదాన మండపంలో పాము దర్శనం

గొల్లప్రోలు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసియున్న స్వయంభూ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అన్నదాన మండపంలో బుధవారం పాము దర్శనమిచ్చింది. ఇదే ప్రాంతంలో ఆలయ అర్చకుడి కుటుంబం నివాసముంటోంది. ఉదయమే వచ్చిన పాము సాయంత్రం వరకు అక్కడే ఉండిపోయింది. అనంతరం సమీపంలో ఉన్న పుట్టలోకి వెళ్లిపోయింది. షష్ఠి ఉత్సవాలు సమీపిస్తున్న తరుణంలో సుబ్రహ్మణ్యస్వామి ప్రత్యక్షంగా పాము రూపంలో వచ్చాడని భావించి భక్తులు దర్శించుకున్నారు.



ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దారు, బీజేపీ నాయకులు

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

కరప, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరపలో ఝాన్సీలక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షురాలు యర్రంనీడి పద్మావతి, మండల ఇన్‌చార్జి తుమ్మలపల్లి నాని ఆధ్వర్యంలో లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు చిన్నారులు ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలతో ప్రదర్శనలు ఇచ్చి ఆహుతులను అలరించారు. చిన్నారులకు తహసీల్దారు తుమ్మల దుర్గాప్రసాద్, నాని బహుమతులు అందజేశారు. బీజేపీ నాయకులు పుట్టా వీరప్రసాద్‌గాంధీ, నల్లా వెంకటేశ్వరరావు, గోపిశెట్టి సుబ్బలక్ష్మి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తదితరులు పాల్గొన్నారు.

సోమసుందర్ జయంతి

పిఠాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ ఆవంత్స సోమసుందర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ వి.కేశవరావు, జన విజ్ఞాన వేదిక కన్వీనర్ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమసుందర్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డి.కాశీ విశ్వనాథం, శోభన్‌బాబు, ఏజీఎంసీ హుస్సేన్ మొహిద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపన్నులకు 'చేయూత' అండ

గొల్లప్రోలు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆపద, కష్టాల్లో ఉన్న వారికి చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలుస్తోందని వ్యవస్థాపకుడు రవికుమార్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నిరుపేద దివ్యాంగుడి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం, నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర వస్తువులను సంస్థ ప్రతినిధులు, నాయకులు బుధవారం అందజేశారు. దివ్యాంగుడి కుమార్తెను చదివించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రిలో డెలివరీ అనంతరం తల్లిని కోల్పోయిన చిన్నారి కుటుంబానికి రూ.15వేలు అందజేశారు. చిన్నారికి వైద్య చికిత్స నిమిత్తం సహకారం అందజేస్తామని తెలిపారు. గొల్లప్రోలు భవిత కేంద్రానికి స్పీచ్ ట్రైనర్ మిషన్ అందజేశారు. జనసేన ఫైవ్ మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్, అల్లం దొరబాబు, జయసూర్య హేచరీస్ అధినేత మురళీమోహన్, గాజుల గోవింద్, లోకారెడ్డి స్వామి, పోసిన రవి తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి నగదు, నిత్యావసరాలు అందజేస్తున్న చేయూత సంస్థ ప్రతినిధులు

ఆస్తి పన్ను బకాయిల వసూలుకు నేడు ప్రత్యేక డ్రైవ్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో పేరుకుపోయిన ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నుల మొండి బకాయిలను తక్షణం వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఇన్‌చార్జి కమిషనరు కేటీ సుధాకర్ సూచించారు. డిప్యూటీ కమిషనరు కె.శ్రీనివాస్ అధ్యక్షతన స్మార్ట్ సిటీ సమావేశ హాల్లో సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నగరంలో దాదాపు రూ.40 కోట్లు వరకు మొండి బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని, వీటి వసూళ్లను వేగవంతం చేయడానికి గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగులు తమ రోజువారీ పనులతో పాటు పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి రెవెన్యూ శాఖకు సహకరించాలని సూచించారు. సమావేశంలో టీపీఆర్వో శైలజ, వాటర్ వర్క్స్ అధికారి డి.లక్ష్మీనారాయణ, రెవెన్యూ అధికారి శిరీష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, నోడల్ అధికారులు, సచివాలయ అడ్మిన్లు, ఎనిమిటీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాంటీ బయోటిక్స్ వినియోగంపై అవగాహన ర్యాలీ

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) అవగాహన వారోత్సవం సందర్భంగా జీజీహెచ్ ప్రాంగణంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎంఆర్ పెరగుతున్న నేపథ్యంలో యాంటీ బయోటిక్స్‌ను అర్హులైన వైద్యుల సలహా మేరకు మాత్రమే వాడాలని ప్రజలకు సూచించారు. యాంటీ బయోటిక్ రెసిస్టెన్స్ వల్ల సాధారణ ఇన్‌ఫెక్షన్లకే చికిత్స క్లిష్టతరమవుతుందన్నారు. ప్రజల్లో బాధ్యతాయుతమైన మందుల వినియోగంపై అవగాహన పెంచడం ఈ ర్యాలీ లక్ష్యమన్నారు. అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ కోమల, మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ ప్రసన్న పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో సత్య సాయిబాబా శత జయంతి మహోత్సవాలు

పిఠాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొజ్జావారితోటలో ఈ నెల 22, 23 తేదీల్లో భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. 22వ తేదీ తెల్లవారుజామున నగర సంకీర్తన, ఉదయం ప్రశాంతి పతాకావిష్కరణ, జ్యోతిప్రజ్వలన, సామూహిక సత్యవ్రతాలు, సాయంత్రం బాలవికాస్ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి. 23వ తేదీ ఉదయం సామూహిక రుద్రాభిషేకం, మహా నారాయణ సేవ, వస్త్రదానం, స్వామివారితో అనుభవాలు, సాయంత్రం మహా మంగళహారతి, స్వామి ఊయల సేవ నిర్వహిస్తారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లుచేయాలి: ఆర్డీవో

కాకినాడ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు సూచించారు. ఇంద్రపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద చేపడుతున్న ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు. తాగునీరు, పారిశుధ్య చర్యలు చేపట్టాలని, భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లుచేయాలని అధికారులకు, ఆలయ ఉత్సవ కమిటీకి సూచించారు. సహాయ కమిషనరు నాగేశ్వరరావు, తనిఖీదారు ఫణీంద్ర, రూరల్ ఎంపీడీవో సతీష్, తహసీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారి, ఈవో జోగా సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

'సుప్రీం' తీర్పు అమలులో ఉదాసీనత వద్దు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో వీధుల్లో తిరిగే కుక్కలు, ఆవులకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలులో ఎటువంటి ఉదాసీనత ప్రదర్శించరాదని బీజేపీ సీనియర్ నేత ఎనిమిరెడ్డి మాలకొండయ్య, సిటిజన్స్ ఇనీషియేటివ్ కార్యదర్శి దువ్వూరి సుబ్రహ్మణ్యం, యార్లగడ్డ రామ్‌కుమార్ కోరారు. బుధవారం వారు ఇన్‌చార్జి కమిషనరు కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డి.పృధ్వీచరణ్‌లను కలిసి ఈ మేరకు వినతిపత్రాలు అందజేశారు.

పారిశుధ్య నిర్వహణ మెరుగుకు స్పెషల్ డ్రైవ్

గొల్లప్రోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు నగర పంచాయతీ కమిషనరు పి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుంచి పోలీస్ స్టేషన్ వరకు గల డ్రైన్లలో పూడిక తొలగింపు, గడ్డిని చెక్కించి చదును చేయించే పనులు చేపట్టారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రఘుప్రసాద్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

గండేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం మురారికి చెందిన పాకలపాటి సత్యవతి ఏప్రిల్‌లో గండేపల్లి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో ఎకౌంటు తెరిచింది. అలాగే రూ.500 ఇన్సూరెన్స్ కట్టింది. జూన్ 11న రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందడంతో ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ రూ.10 లక్షల నగదు చెక్ బుధవారం సత్యవతి భర్త వీరబాబుకు ఎస్‌బీఐ తుని రీజినల్ మేనేజర్ ప్రసాదరావు అందజేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

● ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఐటీడీఏ పీవో, ఎస్టీ కమిషన్ సభ్యురాలు

రంపచోడవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు సద్వినియోగం చేసుకొని గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అన్నారు. బుధవారం పందిరి మామిడి కృషివిజ్ఞాన కేంద్రంలో పీఎం కిసాన్, సుఖీభవ పథకాల ద్వారా రైతులకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన తో పాటు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత ముఖ్యఅతిథులుగా హాజరై లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా రెండోవిడతగా ఒక్కో రైతుకు రూ.7వేలు రైతుల ఖాతాలలో జమ చేయనున్నట్టు తెలిపారు. 11 మండలాల్లో 40,358 రైతులకు రూ.28కోట్ల 23లక్షల 30వేలు లబ్ధిదారుల ఖాతాలలో జమ చేశా మన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు సునీత మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రతి రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు డైరెక్టర్లు రామ్మోహన్‌రావు, కె.సావిత్రి, పీహెచ్‌వో దేవదానం, కేవీకే శాస్త్రవేత్తలు డా క్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ వెంగయ్య, సర్పంచ్ శ్రీదేవి, మండల వ్యవసాయశాఖాధికారులు కె.లక్ష్మణరావు, సావిత్రి, సీహెచ్ శివశ్రీనివాస్, పి.చక్రధర్, ఎం.కె.సుజాత, కె.విశ్వనాధం, వెంకటేశ్వరరావు, సత్యదేవి, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ అమల

చింతూరు(ఆంధ్రజ్యోతి): చింతూరులో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ అమల, వ్యవసాయ అధికారిణి రత్నప్రభ ప్రారంభించారు. తదుపరి అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నగదు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఏవో రత్నప్రభ మాట్లాడుతూ చింతూరు మండలంలో 2807 మంది రైతులకగాను రూ.1కోటి 94లక్షల, 73వేల వారి వారి అకౌంట్లలో జమ య్యాయన్నారు. చింతూరు, చదలవాడ, ఏజీ కొడేరు, ఏడుగురాళ్ళపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడ మైందన్నారు. సొసైటీ చైర్మన్ చిట్టిబాబు, మార్కెటింగ్ కమిటీ సభ్యుడు సాల్మన్‌రాజు, లక్ష్మణ్, అనిగి చంద్రయ్య, సొసైటీసెక్రటరీ ప్రసన్నకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవీపట్నం(ఆంధ్రజ్యోతి): మండలం ఇందుకూరుపేట రైతు సేవ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గోళ్ళ చంటిబాబు ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యం అమ్మాలని, దళారులు లేదా మధ్యవర్తులు, మిల్లర్ల చేతిలో రైతన్నలు నష్టపోకూడదన్నారు. అన్నదాత సుఖీభవ రెండోవిడత డబ్బులు రైతుల అకౌంట్లోకి జమచేశారన్నారు. ఈ కార్యక్రమంలో కీర్తి గంగాధర్ రావు, మాగాపు బాబురావు, ముంద్రు మధుసూదన్‌రావు గారు, మరిశెట్ల వెంకటేశ్వరరావు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఎటపాక(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యంను విక్రయించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ఏవో దుర్గార మేష్ పేర్కొన్నారు. బుధవారం టీపీవీడు గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను ఆయన ప్రారంభించారు. క్వింటా మద్దతు ధర 2,300గా ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, సర్పంచ్ మోసంరాజు, సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్, పూరేటి వెంకటేశ్వరరావు, బాచినేని మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి,(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి మండలంలోని పీఎం కిసాన్‌లో నమోదైన 5075మంది రైతులకు రూ.1.015కోట్లు తమ ఖాతాలో జమయ్యాయని రాజవొమ్మంగి వ్యవసాయశాఖ అధికారి చక్రధర్ తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ సమాన్ నిధి 21వ విడత రూ.2000, అన్నదాత సుఖీభవ 2వ విడత రూ.5000 రెండు కలిపి 7000 జమ చేశారన్నారు.

నేటి బాలలే రేపటి ఆణిముత్యాలు

వీఆర్‌పురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి భావితరానికి ఆణిముత్యాలు అని వీఆర్‌పురం తహశీల్దార్ సరస్వతి అన్నారు. బుధ వారం రేఖపల్లిలోని ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయం ఆవరణలో సంస్థ డైరెక్టర్, మాజీ బాలల హక్కుల కమిషన్ సభ్యులు వి.గాంబాబు ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహశీల్దార్ పాల్గొని మాట్లాడారు. జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగా రెడ్డి మాట్లాడుతూ అన్నిరంగాలలో సర్వీస్ అందిస్తున్న వారిని సన్మానించి, వారి బాధ్యతను పిల్లల్లో పెంపొందించే విధంగా మంచి కార్యక్రమాలుచేస్తున్న ఏఎస్‌డీఎస్ సంస్థను అభినందించారు. ఉత్తమసేవలు అందించిన 61మంది మెమెంటోలు, ప్రసం శాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్‌కుమార్, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, ఎంఈవో లక్ష్మీనారాయణ, సీడీపీవో మల్లిక, వెలుగు, ఆరోగ్యశాఖలు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డతీగల(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మొట్టమొదటి మహిళా ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. మహిళలకు ముగ్గులు, కుర్చీల పోటీలు, విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

చింతూరు (ఆంధ్రజ్యోతి): చింతూరు సెంటరులో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ అహ్మద్‌అలీ, కృష్ణమూర్తి, అక్బర్, కన్నారావు, బొక్కిలి ప్రసాద్, ఎండీ జవహర్, బొక్కిలి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పనుల గుర్తింపునకు గ్రామసభ

మోతుగూడెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): డొంకరాయిలో ఉపాధిహామీ పథకం ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపుకోసం సర్పంచ్ వేమసంధ్యారాణి అధ్యక్షతన ఏపీవో స్వామి ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు ఈ గ్రామసభకు పంచా యతీ పరిధిలో వివిధ గ్రామాల ప్రజలు హాజరై వారి గ్రామాలకు, వ్యక్తిగతంగా కావాల్సిన పనులను సభ దృష్టికి తీసుకునిరాగా వాటిని సంబంధిత అధి కారులు నోట్ చేసుకున్నారు. ముఖ్యఅతిథిగా ఎంపీటీసీ కరకా వెంకటరమణ హాజరయ్యారు.

రాజవొమ్మంగి(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి గ్రామపరిధిలోని నిరుద్యోగులు తమ వివరాలు పంచాయతీ కార్యాలయం వద్ద తెలియజేయాలని రాజవొమ్మంగి పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి కోరారు. 18సంవత్సరాలు నిండిన నిరుద్యోగ యువతీ, యువకులు ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకుని రావాలని అన్నారు. నిరుద్యోగులకు ఉపాధికల్పనలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం నుంచి వివరాలు అడిగారని సంధ్యారాణి తెలిపారు.

అడ్డతీగల(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులపై బుధవారం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. పనిదినాల కల్పన, వంద రోజులు పూర్తి, కొత్త పనులు అంచనాలు సిద్ధంచేశారు. ప్రతి గ్రామంలో తప్పనిసరిగా పనులు కల్పించాలని ఏపీవో చిరంజీవిరావు సూచించారు.

'పదిలో నూరు శాతం ఫలితాలు సాధించాలి'

చింతూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పదిలో నూరు శాతం ఫలితాలు సాధించాలని అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ స్వామి నాయుడు పేర్కొన్నారు. బుధవారం చింతూరు కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. తదుపరి విద్యా వనరుల కేంద్రాన్ని సందర్శించి యాక్టివిటీస్ పెండింగ్‌లో లేకుండా క్లియర్ చేయాలన్నారు. ఎంఈవో-2 జీవెంకటేశ్వర్లు, కేజీబీవీ ప్రిన్సిపల్ రమాదేవి పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

'కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం'



మురారిలో రెండో విడత పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ చెక్కును విడుదల చేస్తున్న కూటమి నాయకులు

గండేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే రైతులకు పూర్తిస్థాయిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ గండేపల్లి మండలాధ్యక్షుడు పోతుల మోహన్ రావు అన్నారు. మురారి గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గండేపల్లి క్లస్టర్ ఇంచార్జ్, మురారి గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ అధ్యక్షతన పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ నియోజవర్గస్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నియోజకవర్గానికి ప్రభుత్వం విడుదల చేసిన రెండో విడత రూ.20.50 కోట్లు నిధుల చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజవర్గంలో రెండో విడత 30,820 మంది రైతులకు రూ.20.50 కోట్లు నిధులు విడుదల చేసి ఒక్కో రైతుకి రూ.7వేలు వారి ఖాతాలకు వేయడం జరిగిందన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం పరికరాలను రాయితీపై అందించడంతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ గండేపల్లి మండలానికి రూ.4.73 కోట్లు, జగ్గంపేటకు రూ.6.26 కోట్లు, కిర్లంపూడికి రూ.4.56 కోట్లు, గోకవరానికి రూ.4.09 కోట్లు నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేశామన్నారు. ఇటీవల నియోజకవర్గంలో నామినేట్ పదవులు పొందిన నాయకులను క్లస్టర్ ఇంచార్జ్ వసంత్ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, వీరంశెట్టి కాశీబాబు, ఆత్మ కమిటి చైర్మన్ పైడిపాల సూరిబాబు, అడపా భరత్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో హరికృష్ణ సత్యరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు కంటిపూడి సత్యనారాయణ, కందుల కొండయ్య చౌదరి, చావా తమ్మన్నచౌదరి, దాపర్తి సీతారామయ్య, బీజేపీ నాయకులు వెంకటేశ్వరరావు, ఏవో జె.లక్ష్మి, ఎర్రంశెట్టి బాబ్జి, గద్దె అబ్బన్న, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

ఏలేశ్వరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని ఏలేశ్వరం టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇటీవల కిర్లంపూడి మండలం సోమవారంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాకాడ రాజు కుటుంబానికి జగ్గంపేట, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ సహకారంతో రూ.5 లక్షలు పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షులు మూదీ నారాయణస్వామి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, ఎండగుండి నాగబాబు, పెంద్ర శీను, సీహెచ్‌సీ వైస్ చైర్మన్ జొన్నాడ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జగ్గంపేట/కిర్లంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మండలం సోమవారం హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మోర్తా ఆనందరావు, మోర్తా కొండయ్య, కాకడ రాజు, బతిన భద్రం, కుంద్రపు దుర్గా చైతన్య మరణించారు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి మరోతి శివ గణేష్ పరామర్శించారు. మరణించిన ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం ఇప్పించేలా ఎస్సీ కమిషన్ చైర్మన్ పోరాడాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగతామన్నారు. కాంగ్రెస్ కాకినాడ జిల్లా జనరల్ సెక్రెటరీ జోడ చైతన్య, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్య క్షుడు కొమ్ముకూరి శ్రీను, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్, జాయింట్ సెక్రెటరీ పండు తదితరులున్నారు.



టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న యనమల

టీడీపీలోకి చేరిక

తుని రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తునిలో టీడీపీలోకి వలసల జోరు కొనసాగుతుంది. తాజాగా టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ ఆధ్వర్యంలో తొండంగి మండలం శృంగవృక్షం గ్రామం నుంచి దూలం అప్పారావుతో పాటుగా పలువురు టీడీపీలో చేశారు. వారికి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కండువాలు కప్పి ఆహ్వానించారు.

'భూమిని పేదలకు పంచి పెట్టాలి'

జగ్గంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం మల్లిసాల, కే.గోపాలపురం మధ్యలో ఉన్న 583 ఎకరాల అడ్డుకొండ భూమిని రెండు గ్రామాల నిరుపేద ప్రజలకే పంచి పెట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం మల్లిశాలలో నిరసన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ దశాబ్దంగా భూమి లేని ఈ రెండు గ్రామాల నిరుపేదలు ఎన్నో కేసులు అనుభవిస్తూ, ఎన్నో దాడులను ఖండిస్తూ తుప్పలు, డొంకలు, రాళ్లు, రప్పలు కొట్టుకుంటూ ఆ భూమి వస్తే మా కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని ఆశపడుతూ పోరాటం సాగిస్తూనే ఉన్నారన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆ భూములను ఇండస్ట్రియల్ పార్క్‌కి అప్పచెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది సరైన ఆలోచన కాదన్నారు. ఇప్పటికైనా మల్లిసాల అడ్డుకొండ భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు అనే ఆలోచనను విరమించుకొని, పేదలకు పంచి పెట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్, మల్లిశాల గ్రామ నాయకులు బోడకుర్తి అబ్బులు, ఆగంట అప్పారావు, అన్నవరం, ముత్తా చంద్రరావు తదితరులు ఉన్నారు.



ఆందోళన చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

వి.కొత్తూరులో వన సమారాధన



బహుమతులు అందజేస్తున్న లోవరాజు

తుని రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వి. కొత్తూరు పంచాయతీ పరిధిలో టీడీపీ సీనియర్ నాయకుడు, షుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు ఆధ్వర్యంలో వి.కొత్తూరులో జరిగిన కార్తీక వన సమారాధన జరిగింది. గ్రామస్తులు తరలిరాగా ఉసిరి వనంలో శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. రొంగల అబ్బు, పిల్లి శ్రీను, గేదెల లోవరాజు, భోజంగి నరేష్, ఇతంశెట్టి రాజారావు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

బాల్య వివాహాలపై అవగాహన

ఏలేశ్వరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలల భవితే దేశ భవిష్యత్తుకు ఆధారమని నగర పంచాయతీ మాజీ కౌన్సిలర్లు సామంతల సూర్య కుమార్, సుంకర రాంబాబు పేర్కొన్నారు. బుధవారం బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రసాద్, ఏలేశ్వరం పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ నేతృత్వంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గుడ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. సాయి సునీత, సాదే రాంబాబు, రాజ్యలక్ష్మి, జోష్న, సాయి పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి సాయం

కిర్లంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన 7ఏళ్ల నెల్లిపూడి కార్తీక్ గుండెకు రంధ్రం పడి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆపరేషన్‌కు రూ.7లక్షలు అవసరంగా కాగా, రూ.4 లక్షలు సీఎం సహాయనిధి నుంచి మంజూరయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన విశ్వలో విలీనం ట్రస్ట్ అధినేత పెంటా శ్రీనివాస ఆచార్యులు కాకినాడకు చెందిన బంగారు పనివారల సంఘం తరఫున అరటకట్ల రామ్మోహన్ రావు, కాకినాడ జిల్లా విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం, కిర్లంపూడి మండలం విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం, జగపతినగరం గద్వాల్ యూత్, సభ్యులు కిర్లంపూడి కామాక్షి జూయలర్స్ అధినేత, విశ్వబ్రహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తల వీరప్రసాద్, బ్రహ్మంగారి ఆలయ కమిటీ సభ్యులు కొత్తల శ్రీను, మరో దాత మండా శ్రీరామ్ ద్వారా సేకరించిన మొత్తం రూ.3 లక్షల బాధిత బాలుడు కార్తీక్ తల్లి నెల్లిపూడి శివగనిదుర్గకు బుధవారం కిర్లంపూడి విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కిర్లంపూడి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అందజేశారు.



తిరుపతిలో అన్నమయ్య పీఠం సమావేశంలో పాల్గొన్న దృశ్యం

తిరుమలపై సాధు భవనం నిర్మించాలి

హిందూ ధార్మిక సమ్మేళనం తీర్మానం

ప్రత్తిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై సాధు భవనం నిర్మించాలని జాతీయ హిందూ ధార్మిక సమ్మేళనం తీర్మానించింది. తిరుపతిలో అన్నమయ్య పీఠాధిపతి విజయ శంకర స్వామిజీ ఆధ్వర్యంలో తిరుపతిలోని యశోధనగర్ యోగి వేమన విజ్ఞాన కేంద్రం వద్ద శ్రీవారి భక్తుల సమస్యలపై 108 మంది పీఠాధిపతులతో మంగళ, బుధవారాల్లో జాతీయ హిందూ ధార్మిక సమ్మేళనం నిర్వహించారు. స్వామిజీలు, పీఠాధితులు, మఠాధిపతులు, సన్యాసులు, గురువులు, కళాకారుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం హిందూ ధార్మిక సమ్మేళనం నిర్వాహకులు సమస్యలపై టీటీడీ చైర్మన్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాధు సంఘర్షణ పరిషత్ జాతీయ అధ్యక్షుడు బాగ్యేశ్వర్ రుషి, అన్నమయ్య కళాక్షేత్రం రాష్ట్ర అధ్యక్షుడు సానా సూకరాజు నాయుడు (ధర్మవరం), ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులు పైలా అప్పలనాయుడు, దాసరి సూర్యనారాయణ, సిద్దా రామచంద్రరావు, నరిసే నాగేశ్వరరావు, ఎం.తులసి, వాకపల్లి పీఠాధిపతి కాళి మాతాజీ, పలు ప్రాంతాల సభ్యులు, కళాకారులు, సాధువులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఆసుపత్రిలో వివాదాలు సమసినట్టేనా?

ప్రత్తిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఆసుపత్రిలో ఉద్యోగుల మధ్య నెలకొన్న వివాదాలు సద్దుమణిగినట్టు సమాచారం. బుధవారం ఆసుపత్రికి వచ్చిన జిల్లా ఏరియా ఆసుపత్రుల కోఆర్డినేటర్ మహేష్ ఆసుపత్రికి విచ్చేశారు. ఉద్యోగులు కలిసికట్టుగా ఆయన్ను స్వాగతించి సన్మానించారు. ప్రత్తిపాడు ఆసుపత్రిలో పది రోజులుగా ఉద్యోగులు, ప్రధాన వైద్యాధికారి ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నారు. గత శనివారం ఏలూరు జిల్లా ఏరియా ఆసుపత్రుల కోఆర్డినేటర్ పాల్ సతీష్ ఆసుపత్రికి విచ్చేసి విచారణ చేపట్టారు. రెండోసారి సోమవారం ఈ ఆసుపత్రిలో ఉద్యోగుల మధ్య మళ్లీ వివాదాలు తలెత్తాయి. దీంతో మంగళవారం ఉద్యోగుల వివాదం కలెక్టర్ షాన్‌మోహన్ దృష్టికి వెళ్లింది. కలెక్టర్ ఆదేశాలతో బుధవారం జిల్లా ఏరియా ఆసుపత్రుల కోఆర్డినేటర్ మహేష్ ఆసుపత్రికి విచ్చేసి ఉద్యోగులతో మాట్లాడారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో కోఆర్డినేటర్ మహేష్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మైఖేల్, వైద్యులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

ఆర్థికసాయం

ప్రత్తిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ధర్మవరానికి చెందిన బత్తిన అబ్బులు భార్య చంద్ర, ఇదే గ్రామానికి చెందిన వల్లూరి బాబ్జి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వీరికి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎం.మురళీకృష్ణంరాజు బుధవారం రూ.5వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు నానిపల్లి చంటి, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, తోపాటి బాబ్జి జువ్వల సూకరాజు, యాళ్ళ ఏసు, ముసలయ్య, రాపా అప్పన్న, నీలబాబు, బత్తిన బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



తొండంగిలో రైతులకు చెక్కు అందిస్తున్న దృశ్యం



ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం నిధుల సమావేశంలో పాల్గొన్న కూటమి నాయకులు

రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

తొండంగి నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం నిధుల విడుదల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి రైతులకు నమూనా చెక్కు అందించారు. కార్యక్రమంలో టీడీపీ తుని మండల అధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, ఆత్మ చైర్మన్ ఎస్.సూర్యప్రకాశ్, కోడా వెంకటరమణ, దంతులూరి శ్రీనివాస్‌రాజు, ఎంపీడీవో సాయి నవీన్, ఏడీ చంద్రశేఖర్, ఏవో పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే కూటమి ధ్యేయం

ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కన్నబాబు

ప్రత్తిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అన్నదాత సుఖీభవం, పీఎం కిసాన్ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి జోకా అమృత అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా జరిగిన సభలో కన్నబాబు మాట్లాడారు. సమావేశంలో జనసేన జిల్లా నాయకుడు మేడిశెట్టి సూర్యకిరణ్, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బద్ది మణి రామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు అమరాది వెంకట్రావు, ధర్మవరం పీఏసీఎస్ చైర్మన్ దాసం శేషారావు, లంపకలోవ పీఏసీఎస్ డైరెక్టర్ మదినే వెంకన్న, టి.రాయవరం సర్పంచ్ తటవర్తి సుబ్బారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని, హార్టికల్చర్ అధికారులు దివ్యశ్రీ, స్థానిక నాయకులు చలంకూరి భాను, ముత్యాల రాము, రావూరి తాతాజీ తదతరులు పాల్గొన్నారు.

కోటనందూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కమలాపురంలో బుధవారం సీఎం చంద్రబాబు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని టీవీల ద్వారా టీడీపీ సీనియర్ నేత గాడి రాజుబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు పోతల సూరిబాబు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద రైతులు, టీడీపీ నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో లోవ దేవస్థానం మాజీ చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి రమేష్, షేక్ నవాబ్‌జానీ, పెంటకోట భాస్కరసత్యనారాయణ, చిటికెల సత్యనారాయణ, పెనుముచ్చు నాగేశ్వరరావు, యర్ర చినసత్యనారాయణ, గెద్దం కొండయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ప్రత్తిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. ఎంపీపీ ఎ.కాంతి సుధాకర్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశపు మందిరంలో జరిగే సమావేశంలో ప్రభుత్వ శాఖల అభివృద్ధిపై సమీక్షిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రత్తిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని రెడ్నం రామమూర్తి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో జరిగే కబడ్డీ, వాలీబాల్ పోటీలకు జిల్లా తరపున ఎంపికైన అప్పిరెడ్డి రేష్మ వర్థిని, బొజ్జపు జ్యోత్స్న, బొడ్డు వర్షిని, మర్రి పద్మవల్లి, చిట్టిబోయిన ఆనంద్, వార అభిరాములను బుధవారం హైస్కూల్ ప్రాంగణంలో హెచ్ఎం. సి. జాన్ ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ మాదే రాజేంద్రప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు రత్నం రాజు, వీవీ రమణ ప్రసాద్ బాబు, పీడీ దేవి కుమారి తదితరులు అభినందించారు.

అరుణాచల క్షేత్రంలో శక్తి గణపతి హోమం

ప్రత్తిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాచపల్లి అడ్డరోడ్డు వద్ద గల అరుణాచల క్షేత్రంలో బుధవారం కార్తీక బహుళ చతుర్దశి సందర్భంగా శక్తి గణపతి హోమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు స్వామి రామానంద ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన హోమ పూజల్లో ఒమ్మంగి భారతి విద్యానికేతన్ అధినేత సుంకర వీరబాబు దంపతులు పాల్గొన్నారు. అరుణాచలేశ్వరస్వామికి, విఘ్నేశ్వర స్వామికి సామూహిక పంచామృతాలు, పంచహారతులు, పూజలు నిర్వహించారు. గణపతి ఆలయం ఎదుట వినాయకుడి ఆకృతిలో ఏర్పాటు చేసిన దీపోత్సవం ఆకట్టుకుంది.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోండి

కోటనందూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ ఏఈవో జగ్గ అప్పారావు అన్నారు. కె.కొట్టాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు చిటికెల బాపన్నదొర క్షేత్రంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. రసాయన ఎరు వులు ఉపయోగించకుండా రైతులు ప్రకృతి వ్యవసాయం వ్యవసాయం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయానికి రాయితీలు ఇస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సురేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పకు అభిషేకాలు

శంఖవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం గురుస్వామి కుసుమంచి శ్రీనువాసుస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అన్నాభిషేకం, పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతికి ఇందిరాగాంధీ కృషి

ప్రత్తిపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దివంగత ఇందిరాగాంధీ ఎంతో కృషి చేశారని కాకినాడ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు దర్శాల కోట శ్రీను అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం కళామందిర్ సెంటర్‌లో ఉన్న విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొప్పన కోటేశ్వరరావు, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి కొల్లు వీరగణేష్, దాసరి సత్తిబాబు, కందిమళ్ళ శామ్యూల్, ఇరుగుల చక్రం పాల్గొన్నారు.